
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

మంగళవారం 19 నవంబరు 2024 | 5



కార్తీక దీపోత్సవం







రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్ సోమవారం రాత్రి కార్తీక దీపాల వెలుగులతో నిండిపోయింది.. లక్ష దీపోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి పెద్ద ఎత్తున భక్తజనం హాజరై దీపాలను వెలిగించారు.. ఎంపీ పురందేశ్వరి దీపోత్సవానికి హారతిచ్చి ప్రారంభించారు. -6

భక్తజన గోదారి



కార్తీకమాసం మూడో సోమవారం గోదావరి ఘాట్లు భక్తజనంతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే ఎక్కడెక్కడి నుంచో భక్తులు పెద్ద ఎత్తున గోదావరి రేవుల వద్దకు చేరుకుని స్నానం చేసి గోదావరిలో దీపాలు వదిలారు.. గట్టుపై కూర్చుని పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్, కోటిలింగాల ఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రం, ధవళేశ్వరం రామపాదాల రేవుల వద్ద భక్తజన సందడి కనిపించింది. రేవుల్లో కార్తీక దీపాలు కనువిందు చేశాయి.



ఈ ధరలేంటి.. శివ..శివా!

శివుడికి అత్యంత ప్రీతిప్రామైన మాసం కార్తీకం. హరిహరులకు ఇష్టమైన ఈ నెలలో నోములు, నదీ స్నానాలకు, దీపారాధనకు ప్రాశస్త్యం ఉంది. ఇంతటి ప్రశస్తి కలిగిన కార్తీకంలో పూజా సామగ్రి ధరలు కైలాసాన్ని తాకుతున్నాయి. ఇవేం ధరలు శివ శివా! అంటూ భక్తులు ఆ కైలాస వాసుడికి మౌనంగా విన్నవించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయిన ధరలు చూసి సామాన్యుడు నొచ్చుకుంటున్నాడు. ఓ వైపు సంపూర్ణ పూజా సామగ్రి కైంకర్యాలలో లోటు రాకూడదనే మనోభావన. మరోవైపు ధరలు వింటూ జేబులు తడుముకొనే దైన్యం. మామిడి ఆకులనూ కొనుక్కోవాల్సిన వైనం. దీంతో ఎంతో కొంత రాజీపడుతూ, మన్నించాలని భగవంతుడిని వేడుకొంటూ కార్తీకంలో పూజలను కానిచ్చేస్తున్నాడు.

పూజాసామగ్రికి ధరాఘాతం



- కార్తీకంలో మహా దోపిడీ
- ఇష్టానుసారంగా ధరలు
- భక్తులను మోసగిస్తున్న వైనం
- నియంత్రణ లేకపోవడమే కారణం
- కొబ్బరి కాయ ఒక్కటీ రూ.50
- మామిడాకులూ అమ్మకం
- కల్తీ ఆవు నెయ్యితో దీపారాధన
- అగరబత్తీలదీ ఇదే పరిస్థితి
- అంతటా పెరిగిన మోసం
- కోట్లలో సాగుతున్న వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)


అన్ని మాసాల్లోనూ కార్తీకం సర్వశ్రేష్ఠమైనదని నమ్మకం.ఏడాదంతా ఎలా ఉన్నా ఈ ఒక్క నెలలో మాత్రం ఆధ్యాత్మిక వెల్లివిరుస్తోంది. దేవాలయాలు దైవ నామస్మరణతో మార్మోగుతుంటాయి. శివుడు, అయ్యప్ప,సుబ్రహ్మణ్య, ఆంజనేయ మాల ధారణకు ఈ మాసాన్నే ఎంచుకుంటారు. ఎన్ని రోజుల దీక్ష అయినా కార్తీకం పూర్తిగా కలి సొచ్చే విధంగా ప్రణాళిక వేసుకుంటారు. కార్తీకంలో నోములు నోచుకోవడం,నదీ తీరాల్లో దీపాలు వెలిగించి దైవారాధన చేయడం కనిపిస్తుంది.దీనినే వ్యాపారులు సొమ్ము చేసు కుంటు న్నారు.ఇష్టానుసారం ధరలు పెంచి విక్రయించేస్తున్నారు. దీంతో భక్తులు ఈ ధరలేంటి శివ శివా అంటున్నారు.

పూజ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఏ వస్తువు కూడా రూ.20కి తక్కువ లేకుండా ఉంది. చివరికి ఐదు కొమ్మల మామిడి ఆకులను రూ.20కి అమ్మేస్తున్నారు. పనస ఆకుల విస్తరి ధరా అంతే. పత్రి పేరుతో రకరకాల ఆకులను అంగట్లో పెడుతున్నారు. రూ.10 పెడితే ఒత్తులు రావడం లేదు. కొబ్బరి కాయ రూ.20 మొదలుకొని రూ.50 వరకూ ఉంది. రైతు వద్ద అంత ధర లేకపోవడం గమనార్హం. దైవారాధనకు వినియోగించే కర్పూర అరటిపండ్లు డజను రూ.40 నుంచి గరిష్ఠంగా రూ.100 చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో కొబ్బరి, అరటి హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. స్టేడియం రోడ్డులో పెద్ద సంఖ్యలో కొబ్బరికాయల దుకాణాలు ఉన్నాయి. గోదావరి గట్టున రోజూ ఉభయ గోదావరి జిల్లాల్లోని గ్రామాల నుంచి రోజుకు 5 వేల అరటి గెలలు హోల్‌సేల్ మార్కెట్‌కి వస్తాయి. ఇక్కడ ధరలకు రిటైల్‌గా విక్రయించే రేట్లకు పొంతన ఉండడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటి పండ్లు, అరటి డొప్పలు, అగరవత్తులు, తమలపాకులు, కర్పూరం.. అన్నిటి ధరలూ అధికంగానే ఉన్నాయి. ఒకప్పుడు రూ.10 ఉండే 50 గ్రాముల కర్పూరం బిళ్లల ప్యాకెట్ ఇప్పుడు రూ.40 అయిపోయింది. కాస్త మంచిది కావాలంటే రూ.160 వరకూ చెల్లించాలి. ధూప్‌స్టిక్స్ రూ.10 నుంచి రూ.30కి చేరిపోయాయి. అయ్యప్ప పడి పూజ నిర్వహిస్తే పువ్వులకు, పూజా సామగ్రికే 70 శాతం డబ్బులు ఖర్చయిపోతున్నాయి. రూ.20కి లెక్కపెట్టి మరీ 10 చొప్పున చామంతి, బంతి పువ్వులు ఇస్తున్నారు. సోమవారమైతే రూ.20కీ పువ్వులు రావడం లేదు. అగరవత్తుల కాస్త సువాసన వచ్చేవి కావాలంటే రూ.50 నుంచి ధర మొదలవుతుంది. ఇక అయ్యప్ప ఇరుముడికి కావాల్సిన సంచి, అభిషేకం కిట్టు, నెయ్యి, కొబ్బరి కాయలు, రవిక ముక్కలు, కొత్త టవల్, బియ్యం ధరలూ గతేడాదికి ఇప్పటికీ నూరు శాతం పెరిగాయి.దీక్షకు అవసరమైన పూసల మాలల రేట్లూ విపరీతంగా ఎక్కువయ్యాయి. గతంలో రూ.50కి దిరికే తులసి మాల ధర రూ.250కి చేరుకొంది. స్వచ్ఛమైన స్ఫటిక,చందనం పూసలు రాగితో గుప్పినవైతే రూ.1500, వెండితో కనీసం రూ.5 వేలు అవుతోంది.ఈ క్రమంలో దీక్ష పూర్తయ్యే సరికి వ్యయం లెక్కలోకి తీసుకుంటే ఐదేళ్ల క్రితానికి ఇప్పటికీ 500 శాతం వ్యత్యాసం గమనించవచ్చు.

పసుపు..కుంకుమ కల్తీవే..

పసుపు,కుంకుమ అయితే పూర్తి గా కల్తీవే వస్తున్నాయి. ఆవుపాలను అభిషేకానికి వినియోగిస్తారు.ఇవి పూర్తిగా కల్తీవే విక్రయిస్తు న్నారు. వాటి ధరలు తక్కువేమీ లేదు. 50 గ్రాముల పసుపు, కుంకుమ రూ.25 చొప్పున రేటు ఉంది. బ్రాండెడ్ కావాలంటే మరో రూ.10 ఇవ్వాల్సిందే. ఒకప్పుడు రూ.5కి 100గ్రాములు వచ్చే పటిక బెల్లం చిప్స్‌ప్యాకెట్ రూ.20కి చేరింది. ఇలా ఒకటేమిటి అన్ని ధరలూ పెరిగిపోయాయి. ఇక కొబ్బరికాయ ధర వింటే అమాంతం పడి పోతారంతే. ఎందుకంటే ఒక్కో కాయ ధర రూ.40 నుంచి రూ.50 మధ్య ఉంది. రైతు వద్ద రూ.10లకు కూడా కొనని కొబ్బరికాయను ఆలయాల వద్ద రూ.20లకు విక్రయించడం గమనార్హం. ఇక అరటి పండ్లదీ అదే పరిస్థితి. కర్పూర డజను సైజు బట్టి రూ.50 నుంచి రూ.100లకు విక్రయిస్తున్నారు.5 అరటి ఆకులు రూ.30లు తీసుకుంటున్నారంటే ఎంత దోపిడీయో అర్థం చేసుకోవచ్చు.ఇక దీపాలు వదిలేందుకు వినియోగించే అరటి పువ్వులు, డొప్పల ధర చూసి గ్రామస్తులు నోరెళ్లబెడు తున్నారు.ఎందుకంటే ఒక్కో డొప్ప రూ.10.. అరటి పువ్వు అయితే రూ.30.. పట్టణవాసులు తెలియక ఎంత అడిగితే అంత ఇచ్చి దీపాలు వదులు కుంటున్నారు.తమలపాకులు, వక్క, ఒకటే మిటి పూజకు వినియోగించే అన్ని ధరలు అమాంతం పెంచేశారు.ధరలపై కనీస నియంత్రణ లేక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసాన ఈ ధరలేంటి నమశ్శివాయ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెయ్యి తీరే వేరు ఈశ్వరా!



కార్తీకంలో దీపారాధనకు నూనె కంటే ఆవు నెయ్యి శ్రేష్ఠమని భావిస్తారు. ఆవు నెయ్యితో ఒత్తులు వెలిగిస్తారు.అయితే మార్కెట్‌లో నెయ్యి ఉత్పత్తికి, ధరలకు పొంతన కుదరడం లేదు. ప్రస్తుతానికి రూ.వెయ్యి వెచ్చించినా స్వచ్ఛమైన ఆవు నెయ్యి దొరకడం కష్టమే.అలాంటి పరిస్థితుల్లో రూ.5కి కూడా ఆవునెయ్యి ప్యాకెట్ అని అమ్మేస్తున్నారు.ప్యాకెట్లపై బొమ్మలు చూసి నిజం తెలిసినా మనసును సముదాయించుకొని పూజకు వాడుకోవడం తప్పని పరిస్థితి.గేదె నెయ్యి కంటే ఆవు నెయ్యి ఉత్పత్తి చాలా తక్కువగా ఉంటుంది. దీంతో కల్తీ నెయ్యిని పూజలకు వినియోగించాల్సి వస్తోంది.ఎక్కువ ధర పెట్టినా స్వచ్ఛమైన నెయ్యి దొరికితే అదృష్టమనే చెప్పవచ్చు. నెయ్యిలో నూనె, డాల్డా, ఎసెన్సు కలిపేసి అమ్మేస్తున్నారు.నెయ్యి కిలో రూ.వెయ్యి పైనే విక్రయిస్తున్నారు.అది స్వచ్ఛమేనా అంటే చెప్పడం కష్టమే. ఇక పూజకు వినియోగించే నూనె ధర పావు లీటరు రూ.70 అయిపోయింది.

2 గంటల్లో.. ముంబయి వెళ్లొచ్చు!



రాజమహేంద్రవరం నుంచి ముంబయికి వెళ్లాలంటే ఖచ్చితంగా 48 గంటలు పడుతుంది.. ఎందుకంటే రైలులో ప్రయాణం కదా.. ఇక నుంచి అలా అవసరంలేదు.. కేవలం రెండు గంటల్లో ముంబయి చేరుకోవచ్చు. అయితే డిసెంబరు ఒకటో తేదీ వరకూ ఆగాల్సిందే మరి.. ఎందుకంటే ఆ రోజు నుంచి రాజమహేంద్రవరం టు ముంబయికి ఎయిర్‌బస్‌లు అందు బాటులోకి రానున్నాయి.. ఏకంగా 180 సిట్టింగ్‌తో అటూ ఇటూ తిరిగేందుకు సిద్ధం చేస్తున్నారు.. అదే నెల 12వ తేదీ నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు రానున్నాయి.. వచ్చే నెల నుంచి ముంబయి, ఢిల్లీకి గాలిలో ఎగిరిపోదాం.. - 7లో



రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరిన పలు పార్టీల నాయకులు

రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు

- బీజేపీని ప్రజలు ఆశీర్వదిస్తున్నారు
- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో బీజేపీని ఆశీర్వదించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాష్ట్రంలో 25 లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదు జరగడమే ఇందుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైసీపీ నాయకుడు తగరం సురేష్‌బాబుతో పాటు పలువురు దళిత, మైనార్టీలు బీజేపీలో చేరారు. పార్టీ కండువాలను కప్పి వారిని బీజేపీలోకి ఆహ్వానించి మాట్లాడారు. అంబేడ్కర్ పేరు చెప్పుకున్న పార్టీలు ఆయనకు చేసిందేమీలేదన్నారు. మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకు చేస్తున్న పోరాటం గురించి మోదీ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఒక కమిటీ వేయడం జరిగిందని, రిపోర్టు కూడా రావడం జరిగిందని, సుప్రీం కోర్టు తీర్పు కూడా వచ్చిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెద్దఎత్తున సహకారం అందిస్తున్నదన్నారు. గ్రామీణాభివృద్ధిపై గత ప్రభుత్వం శీతకన్ను వేయడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, గ్రామీణాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో కేంద్రం రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి రూ.4,800 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో భారీగా సభ్యత్వాలు నమోదు చేసిన ప్రతి కార్యకర్తలకు అభినందనలు తెలుపుతున్నానన్నారు.కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి మాట్లాడారు. పార్టీ నాయకులు మాలతిరాణి పాల్గొన్నారు.



మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ

తాడిపర్రు మృతులకు సంతాపం

ఉండ్రాజవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాడిపర్రు మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. తాడిపర్రులో విద్యుదాఘాతానికి గురై మరణించిన బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంత, కాసకాని కృష్ణ, పామర్తి నాగేంద్ర కుటుంబాలను సోమవారం పరామర్శించారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, కూటమి నాయకులు పెండ్యాల గోవిందరావు,రాచమళ్ల శ్రీనివాసరావు, అక్కిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ఇబ్బందులు

సమస్య పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి అనగానికి విన్నపం



రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సమస్యను విన్నవిస్తున్న కూటమి నాయకులు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కూటమి నాయకులు కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఉమ్మడి పశ్చి మ గోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే తప్పులతడకగా సాగిందన్నారు.రీసర్వేతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనిమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.రైతులకు సంబంధించిన పాత రికార్డుల ఆధారంగా రీసర్వే రికార్డులు మార్చు చేయాలని కోరారు.మంత్రిని కలిసిన వారిలో కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కొఠారువెంకట్రావు,నామాన పరమేష్ పాల్గొన్నారు.





కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు,108 సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఆశ, 108 సిబ్బంది నిరసన

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకలెక్టర్ కార్యాలయం సోమవారం దీక్షలు ,ధర్నాలతో దద్దరిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాపీ ప్రకారం జీవోల సర్క్యులర్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు.యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు ఎం. సుందర్‌బాబు మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో ఆశ వర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ఇటీవల రిటైర్మెంట్ అయిన వర్కర్స్‌కు బెనిఫిట్స్ రూ.60వేలు అందలేదని, 60 ఏళ్ళు నిండిన వారు రెండేళ్ల వయోపరిమితి పెంపుదలకు అనర్హులుగా మిగిలిపోయారన్నారు. ఇటీవల మరణించిన ఆశవర్కర్లకు మట్టి ఖర్చులు రూ.20 వేలు అందలేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీచేయాలని కోరారు.అనంతరం యూనియన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతి పత్రం అందించారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి, బి.పవన్, వై.బేబిరాణి, జువ్వల రాంబాబు మద్దతు పలికారు.ఈ కార్యక్రమంలో మేరి, టి.రామతులసి, టి.నాగమణి, పి.అనూష, ఏ.ధనలక్ష్మి, కే.వెంకటలక్ష్మి, ఎం.హవీలకుమారి పాల్గొన్నారు.

108 సిబ్బంది దీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 అంబులెన్స్ సర్వీసు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 108 సిబ్బంది కలెక్టరేట్ వద్ద దీక్ష చేశారు. 8 ప్రధాన డిమాండ్ల ధర్నా చేస్తున్నామని.. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25వ తేదీ తర్వాత సమ్మెకు దిగుతామని అన్నారు. సీఐటీయూ సెక్రటరీ పూర్ణిమా రాజు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఈఎస్‌వీ.రమణ, గుజ్జుల రమేష్ బాబు,నానాజీ,వెంకటేశ్వరరావు, రమేష్ నాయుడు, శ్రీధర్, జగపతి, నంది రాజు, సునీత శ్రావణి, సుమలత విజయ్ దీక్ష చేశారు.



పీజీఆర్ఎస్‌కు 129 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు నిర్దేశిత కాలవ్యవధిలోనే పరిష్కరించాలని డీఆర్వో టి.సీతారామమూర్తి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజల అర్జీలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 129 అర్జీలను స్వీకరించారు.కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీరాములునాయుడు, సీపీఐ అప్పలకొండ, డీఎల్‌డీవోలు స్లీవా రెడ్డి, డీఎంహెచ్‌వో కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన ఎమ్మెల్సీ నామినేషన్లు | 6 | ఈ ఆలయానికి 1132 ఏళ్లు!


తొండంగిలో సద్యోజాత శివాలయం



శంకరా.. అర్ధనారీశ్వరా..

తొండంగిలో అరుదైన సద్యోజాత శివాలయం

తొండంగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దర్శనం చేసుకుంటేనే తక్షణ ఫలితాన్ని అనుగ్రహించే అరుదైన సద్యోజాత శివాలయంగా పేరొందింది. రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరుడి నిలయంగా కొలువైన ఈ ఆలయం కాకినాడ జిల్లా తొండంగి మండల కేంద్రంలో ఉంది. అన్ని శివాలయాలకంటే అత్యంత విశిష్టమైన శివాలయం పశ్చిమాభిముఖ శివాలయమని శైవాగమం పేర్కొంది. ఇటువంటి ఆలయాన్ని సందర్శిస్తే మరుక్షణం ఉత్తమ ఫలితాన్ని అందిస్తుందని, ఎక్కడైనా తారసపడితే తప్పక దర్శించి స్వామి అనుగ్రహం పొందాలని చెబుతోంది. తొండంగిలో ఉన్న రామలింగేశ్వరుడు పశ్చిమాభిముఖుడై సద్యోజాత ముఖంతో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ఈ ఆలయం అనేక విశిష్టతలకు నెలవై ఉంది. స్వామి లింగం అర్ధనారీశ్వర తత్వానికి ప్రతీకగా నిలిచింది. శివలింగం సగభాగం గౌర వర్ణంతో అమ్మవారికి ప్రతీకగా నిలుస్తోంది. ఆలయానికి పశ్చిమాన స్వామికి నిలయంగా చెప్పే రుద్రభూమి ఉంది. అమ్మవారు రాజరాజేశ్వరిగా కొలువై ఉన్నారు. ఉత్తరాన కోనేరు ఉంది. ఆలయ ప్రాంగణంలో సీతారాములు, చండీశ్వరుడు, వినాయకుడు, కాలభైరవుడు, అష్టలక్ష్ములు నవగ్రహాలు పరివార దేవతలుగా కొలువై ఉన్నారు.ఈ ఆలయాన్ని బ్రిటీష్ కాలంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసి



స్వామి అనుగ్రంతో పదోన్నతి పొందిన డబ్బీరు వెంకట రమణయ్యపంతులు జీర్ణోద్ధరణ చేసినట్టు చెబుతారు. తదనంతరం 2004లో గ్రామస్తులు మరోమారు ఆలయ జీర్ణోద్ధరణ జరిపారు. ప్రస్తుతం ఈ శివాలయాన్ని అన్నవరం ఆలయం దత్తత తీసుకుంది. అనేక విశిష్టతలుగల ఈ ఆలయానికి కార్తీక మాసంలో అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకుంటారు. పౌర్ణమి రోజున స్వామి తెప్పోత్సవం ఘనంగా నిర్వహిస్తారు.


పౌర్ణమి రోజున తెప్పోత్సవం


బిక్కవోలులోని త్రిలింగక్షేత్రం

ఈ ఆలయానికి.. 1132 ఏళ్లు!

చరిత్రకు సాక్ష్యం ఏంటి.. తూర్పుచాళ్యులు అంటారు.. మొగలులు.. బాబర్ అంటారు.. ఇలా చరిత్రలో ఎంతో మంది రాజుల పేర్లు వినబడుతుంటాయి.. అయితే ఆనాటి రాజదర్పానికి నిదర్శనమైన కోటలు కనుమరుగయ్యాయి.. చరిత్రలో కలిసిపో యా యి.. అయితే వారు నిర్మించిన ఆలయాలు మాత్రం నేటికీ ఆ రాజుల దర్పానికి నిదర్శనంగా కనిపిస్తూనే ఉంటాయి. అటువంటి ఆలయాలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎన్నో ఉన్నాయి. వాటిలో ఒకటి.. నాడు తూర్పుచాళుక్యులు రాజ్యంలో ఉన్న త్రిలింగ క్షేత్రం బిక్కవోలు.. ఆ ఆలయం ఎప్పుడు నిర్మించారో తెలుసా..క్రీ.శ 849 - 892 సంవత్సరాల మధ్య... అంటే నేటికి 1132 సంవత్సరాలు అవుతోంది. అయినా నేటికీ చెక్కుచెదరలేదు.అపురూప శిల్పకళ భక్తులను అబ్బురపరుస్తోంది.. కార్తీక మాసంలో ఒక్కసారి ఆ ఆలయానికి వెళ్లాల్సిందే.. స్వామి దర్శనం చేసుకుని..ఆ ఆలయంలో సేదతీరాల్సిందే..



- చరిత్రకు సాక్ష్యం.. త్రిలింగ క్షేత్రం
- తూర్పు చాళుక్యుల నిర్మాణం
- ఆకట్టుకుంటున్న ఆలయ శిల్పకళ
- నాడు బిరుదాంకినవోలు..
- నేడు బిక్కవోలుగా ప్రసిద్ధి

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మన దేశంలోని ప్రాచీన దేవాలయాలుగా గుర్తించిన వాటిలో ఆరు దేవాలయాలు తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. సుమారు 1100 ఏళ్ల కిందటే అనేక దేవతా మూర్తులు, పక్రృతి దృశ్యాలు మనోహరంగా మలచబడి దశాబ్దాలుగా ఎన్నో విపత్తులను, దాడులను తట్టుకుని ఇప్పటికే చెక్కు చెదరకుండా ఉన్నాయి. రాజమహేంద్రవరం-కాకినాడ పట్టణాల మధ్య పవిత్ర గోదావరి కాలువ చెంతనే ఉన్న బిక్కవోలు గ్రామాన్ని తూర్పుచాళుక్యులు క్రీ.శ 849 - 892 సంవత్సరాల మధ్య బిరుదాంకినవోలు పేరుతో రాజధానిగా చేసుకుని పరిపాలించారు. ఆ సమయంలోనే వారు పలు దేవాలయాలు నిర్మించారు. వాటిలోనివే బిక్కవోలులోని ఆరు దేవాలయాలు. గ్రామంలో ఉన్న ఈ ఆరు దేవాలయాల్లో ఐదు శివాలయాలే. వీటిలో గోలింగేశ్వర, రాజరాజేశ్వర, చంద్రశేఖర దేవాలయాలు గ్రామం మధ్యలో ఒకే ప్రాంగణంలో ఉండి భక్తుల పూజాధికాలతో నేటికి అలరారుతున్నాయి. గోలింగేశ్వరస్వామి గర్భగుడి లోపల ప్రధాన ద్వారబంధంపై ఉన్న తెలుగు అక్షరాల లిపి వెయ్యేళ్ల కాలం నాటిదని చరిత్రకారుల అభిప్రాయం. స్వామివారిని తదేకంగా చూస్తున్న నంది విగ్రహం కూడ ప్రాచీనమైనదే. ఇక్కడ ధ్వజస్తంభాన్ని ఆనుకుని ఉన్న కౌమారి విగ్రహం వద్ద భక్తులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తుంటారు.ప్రాచీన దేవాలయాలకే కాక ప్రతి యేటా ఎంతో వైభవంగా నిర్వహించే శ్రీకుమాసుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలతో బిక్కవోలు గ్రామం రాష్ట్ర ఖ్యాతి గడించింది.బిక్కవోలు ప్రాచీన దేవాలయాల విశిష్టతను మూడొందల పేజీలతో అరవై ఛాయా చిత్రాలతో సచిత్రంగా..దిటెంపుల్ ఆఫ్ బిక్కవోలు.. అనే గ్రంథం పేరుతో ఆంధ్రా విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు అందించారు. లక్షలాది ప్రాచీన కళాప్రియులకు నాగేశ్వరరావు అందించిన గ్రంథం గొప్ప వరమని చెప్పకతప్పదు.




కేదారేశ్వరస్వామి ఆలయం

గ్రామంలో జైన్ దేవాలయం

గ్రామంలో వేర్వేరు చోట్ల ఉన్న మరో మూడు దేవాలయాలు జీర్ణ దేవాలయాలుగా మారాయి. ఉన్నత పాఠశాల సమీప పంట పొలాల్లో ఉన్న దేవాలయాన్ని జైన దేవాలయంగా భావిస్తున్నారు. ఎటువంటి విగ్రహం లేకుండా పీఠం మాత్రమే ఉన్న ఈప్రాచీన గుడిని కంచరగుడి అని పిలుస్తారు. ఈ ఆలయ నిర్మాణం పూర్తిగా జైన సంప్రదాయ రీతిలో కొనసాగిందని చెప్పవచ్చు. రాష్ట్రకూటుల సాంస్కృతిక రాజధాని అయిన ఎల్లోరా గుహల్లో చివరిది జైన్ గుహలోని శిల్పకళారీతినే బిక్కవోలు దేవాలయం పోలి ఉంది. నలుపలకలుగా చెక్కిన రాళ్లను సున్నం వాడకుండా కేవలం గురుత్వాకర్షణ శక్తి, అనుపేక్షణీయతా సూత్రంతో ఒక రాయిపై రాయిని పేర్చి దేవాలయాలను నిర్మించారు. సుమారు వందేళ్ల కిందట ఈగుడి నుంచి తీసుకెళ్లిన వర్ధమాన మహావీరుడి ప్రతిమను చెన్నై మ్యూజియంలోని జైన గ్యాలరీలో ఉంచారు. 2006 సెప్టెంబరులో స్థానికుడొకరు ఈ ఆలయానికి దగ్గరల్లో గృహనిర్మాణం నిమిత్తం త్వకాలు జరుపుతుండగా ధ్యానముద్రలో వున్న మహావీరుడి శిల బయల్పడింది. ఇదే ఆలయ ద్వారబంధంపై ఉన్న లక్ష్మీదేవి శిలారూపం చెన్నై మ్యూజియంలోని గుణగవిజయాదిత్యుడి రాజముద్రపై వున్న లక్ష్మీదేవి రూపాన్ని పోలి ఉండడం గమనార్హం. ఈ ఆధారాలతోనే దేవాలయాన్ని జైన దేవాలయంగా భావిస్తున్నారు.


పొలాల మధ్య నేటికీ తెరుచుకోకుండా పాడుబడి ఉన్నజైన్ దేవాలయం



జువ్వలదొడ్డిలో నక్కల గుడి

బిక్కవోలు నుంచి ఊలపల్లి వెళ్లే మార్గంలో మరో ప్రాచీన వీరభద్రుడి ఆలయం ఉంది. ఇటీవల కేదారేశ్వరస్వామిగా కొలుస్తూ శివరాత్రి పర్వదినాన పూజాధికాలు గావిస్తున్నారు. ఈ ఆలయానికి దక్షిణం వైపు ఊలపల్లి రోడ్డు ఉండడంతో వీధిశూల తగలకుండా ఈ ఆలయంపై వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. తూర్పు చాళుక్యుల కాలంలో శిల్పకళకు, వాస్తుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నది ఇందుకు నిదర్శనం. జువ్వలదొడ్డిలో ఉన్న ప్రాచీన ఆలయాన్ని నక్కల గుడిగా పిలుస్తున్నారు. బిక్కవోలు నడిబొడ్డున ఉన్న గోలింగేశ్వర ఆలయంలో గోలింగేశ్వరస్వామితో పాటు సర్వాలంకార భూషితమైన పార్వతిదేవి, విఘ్నాలు తొలగించే వినాయకుడు, భద్రకాళి సమేత వీరభద్రుడు, సహజ పుట్టతో దర్శనమిచ్చే శ్రీకుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒకే ప్రాకారంలో ఉండి నిత్య పూజలందుకుంటూ నేటికీ భక్తులకు దర్శనమిస్తున్నారు.తూర్పు చాళుక్యుల సృజనాత్మకతకు ప్రతీకగా నిలుస్తూ ఉన్నత పాఠశాల దగ్గర కొలువై ఉన్న పదకొండు అడుగుల ఏకశిలా భారీ లక్ష్మీ గణపతి విగ్రహం భక్తుల పూజలతో అలరారుతూ ప్రసిద్ధపుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది.


రాజమహేంద్రవరం కోటిలింగాలఘాట్‌లో దేదీప్యమానంగా లక్ష దీపోత్సవం

కార్తీక దీపాల సంబరం

- రాజమహేంద్రవర కోటిలింగాల క్షేత్రంలో లక్ష దీపోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కోటిలింగాల క్షేత్రంలో లక్ష దీపోత్సవం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పవిత్ర కార్తీక మాసంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం దీప కాంతులతో వెలుగులీనింది. ఉమాకోటిలింగేశ్వర స్వామి దేవస్థానం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 12వ లక్ష దీపోత్సవం వైభవోపేతంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దంపతులు హాజరయ్యారు. ప్రత్యేకఅతిథులుగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, వీరరాఘవమ్మ, టీడీపీ ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, వైసీపీ నేతలు జక్కంపూడి విజయలక్ష్మి, భరత్, షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఆధ్యాత్మిక చింతనతో కార్తీక దీపాలు వెలిగించి హారతులిచ్చారు. కోటిలింగాలరేవులో మెట్లపై ఏర్పాట్లు చేసిన మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగించి పూజలుచేశారు. కోటిలింగాలక్షేత్రం భక్తజనసంద్రంగా మారింది. అతిథులకు కొండలరావు శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ప్రధాన ఆలయాలు కార్తీక సోమవారం సందర్భంగా కళకళలాడాయి. కరప మండలం వాకాడలో దీపాల సంబరం ఆకట్టుకుంది.


రాజమహేంద్రవరంలో హారతి ఇచ్చి లక్ష దీపోత్సవం ప్రారంభిస్తున్న ఎంపీ పురందేశ్వరి


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో తెల్లవారుజామున దీపాలు వదులుతున్న భక్తులు


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు


సామర్లకోట భీమేశ్వరాలయంలో దీపాలతో శివలింగం


భక్తులతో రద్దీగా ఉన్న సామర్లకోట భీమేశ్వరాలయం


రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌వద్ద తెల్లవారుజామున భక్తుల పుణ్యస్నానాలు


కరప మండలం వాకాడ సంబరంలో వెలిగించిన కోటి దీపాలు


నామినేషన్లు అందజేస్తున్న నామన వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, అహమద్ షేక్

ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు..

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- చివరిరోజు4 నామినేషన్ల దాఖలు
- మొత్తం ఆరుకు చేరిన నామినేషన్లు
- నేడు పరిశీలన
- ఈనెల 21వరకు ఉపసంహరణలు
- వచ్చేనెల 5న పోలింగ్
- 9న కౌంటింగ్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీఎన్నికలకు సంబంధించి సోమవారం ఒక్క రోజే నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరు నలుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు సమర్పించారు. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన నామన వెంకటలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కవల నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన పులుగు దీపక్, మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన అహ్మద్‌షేక్ నామినేషన్లను సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా డీఆర్వో వెంకట్రావుకు అందజేశారు. ఈనెల 11వతేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కాగా తొలుత బొర్రా గోపిమూర్తి, తర్వాత గంధం నారాయణరావు నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో చివరిరోజైన సోమవారానికి నామినేషన్ల సంఖ్య ఆరుకు చేరుకుంది. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ల పరిశీలన క్రతువు జరుగుతుంది. ఈనెల 21వతేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ నిర్వహిస్తున్నారు. వచ్చేనెల 5న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఎన్నికల పోలింగ్‌కోసం ఆరుజిల్లాల పరిధిలో 116 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12, తూర్పుగోదావరి జిల్లాలో 20, ఏలూరు జిల్లాలో 20, కాకినాడ జిల్లాలో 22, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22, పశ్చిమగోదావరి జిల్లాలో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా 16,316మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 614 మంది ఓటర్లు, తూర్పుగోదావరి జిల్లాలో 2893, ఏలూరు జిల్లాలో 2605, కాకినాడ జిల్లాలో 3333, కోనసీమ జిల్లాలో 3209, పశ్చిమగోదావరి జిల్లాలో 3662 మంది ఓటర్లు ఉన్నారు. వచ్చేనెల 9న కౌంటింగ్ జరగనుంది. అదేరోజు ఎన్నికల ఫలితాలను వెల్లడించనున్నారు.

ప్రస్తుతానికి బరిలో ఆరుగురు

నామినేషన్లస్వీకరణ గడువు ముగియడంతో ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రస్తుతానికి ఎన్నికల బరిలో ఆరుగురు అభ్యర్థులు ఉన్నారు. ఈనెల 21న ఉపసంహరణల తర్వాత బరిలో ఎవరు నిలుస్తారో లెక్క తేలనుంది.

సత్యదేవుని సన్నిధిలో భక్తుల రద్దీ

- రూ.75లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో కార్తీక సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని రద్దీ నెలకొంది. అధికారులు వేకువజామున 2గంటలనుంచి వ్రతాలు, 3గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఒక్కరోజు 9028 జంటలు స్వామివారి వ్రతాలు ఆచరించగా వివిధ విభాగాల ద్వారా రూ.75లక్షల ఆదాయం లభించింది. 70వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అధికారులు తీసుకున్న చర్యలతో ఆలయ ప్రాంగణంలో ఎంతమంది భక్తులు వస్తున్నా రద్దీ కనబడకపోవడం విశేషం.


వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

మూడు గంటలపాటు నరకయాతన

- ఆగిఉన్న లారీని ఢీకొన్న పాల వ్యాన్
- క్యాబిన్‌లో ఇరుక్కొన్న వ్యాన్ డ్రైవర్
- క్రేన్ సహాయంతో బయటకు..
- కాకినాడ జిల్లా తుని హైవేపై ఘటన



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను స్టీరింగ్ తొలగించి బయటకు లాగుతున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో హైవేపై రాజుల కొత్తూరు సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఓ పాల వ్యాన్ డ్రైవర్ ఆగిఉన్న లారీని ఢీకొన్నాడు. లారీ వెనుకభాగంలో క్యాబిన్ ఉండిపోయింది. దీంతో డ్రైవర్ అందులో ఇరుక్కుపోయాడు. పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సహాయంతో అతడ్ని మూడు గంటల తర్వాత బయటకు తీయగలిగారు. దీనికి సంబంధించిన వివరాలివి..

అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన ఎల్.శ్రీను పాలవ్యాన్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. అతడు విశాఖపట్నం నుంచి కత్తిపూడి వైపు పాల వ్యాన్‌తో వస్తున్నాడు. తుని హైవేపై రాజుల కొత్తూరు సమీపంలోకి వచ్చేసరికి నిద్ర మత్తులో ఆగిఉన్న లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాద తీవ్రతతో వ్యాన్ నుజ్జునుజ్జు అవ్వగా డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతుండగా అటుగా వెళ్తున్న వాహనదారులుఅతడ్ని రక్షించేందుకు ప్రయత్నించినా బయటకి తీయలేకపోయారు. దీంతో పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సహాయంతో బయటకు తీశారు. మూడు గంటలపాటు మృత్యువుతో పోరాడిన శ్రీనును అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. తుని పోలీసులు కేసు నమోదు చేశారు.



అచ్చుగుద్దినట్టు.. అచ్చుగుద్దినట్టుగా పైన కింద.. ఒకేలా ఉన్న ఈ చిత్రం.. కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వరస్వామి ఆలయం కోనేరు వద్ద ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్‌మనిపించింది.. -ఫొటోగ్రాఫర్, కాకినాడ

2 గంటల్లోనే ముంబయి పయనం

- రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్ట్ ఆక్యుపెన్సీ పెంపు
- డిసెంబరు 1 నుంచి ముంబయికి..
- 12 నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు
- 180 సీటింగ్‌తో విమానాల రాకపోకలు

రాజమహేంద్రవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇక్కడి నుంచే దేశవ్యాప్త రాకపోకలకు సన్నద్ధం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజమహేంద్రవరం విమానాశ్రయ అభివృద్ధికి రూ.250కోట్లు కేటాయించారు. దీంతో విమానాశ్రయ రూపురేఖలే మారిపోనున్నాయి. పనులు పూర్తయ్యేలోపు రాకపోకలను పెంచే యోచనలో ఉన్నారు. ఎక్కడికైనా ఇక్కడి నుంచి వెళ్లేలా విమానాశ్రయాన్ని సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకూ 72 సీట్లతో విమానాలు నడుస్తున్నాయి. ఇక డిసెంబరు 1 నుంచి 180 సీట్లు ఉన్న ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. ఇప్పటికే టికెట్లు విక్రయిస్తున్నారు. 1వతేదీ నుంచి రాజమహేంద్రవరం టు ముంబయికి 180 సీట్లతో రోజుకు రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు రాకపోకలు సాగించనున్నాయి. అదే నెల 12వ తేదీనుంచి ఢిల్లీకి రెండు ఇండిగో ఎయిర్‌బస్సులు అటూ తిరుగుతాయి. 1వ తేదీ సాయంత్రం 4.50కి ముంబాయి నుంచి బయలుదేరి 6:45గంటలకు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటుంది. రాజమహేంద్రవరంలో రాత్రి 7.15గంటలకు ఎయిర్ బస్సు బయలుదేరి రాత్రి 9.50 గంటలకు ముంబయి ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. మొత్తం జర్నీ సమయం 2.10 గంటలు. మరో ఎయిర్‌బస్ డిసెంబరు 12న ఢిల్లీలో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి 9.45 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకుంటుంది. రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టులో ఉదయం 10.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం ఒంటిగంటకు ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. ఈ రెండు ఎయిర్ బస్సుల్లో 180మంది చొప్పున ప్రయాణికులు వెళ్లవచ్చు. ఇప్పటివరకూ రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు రోజూ అటూఇటూ 14 సర్వీసులు తిరుగుతున్నాయి. బెంగళూరుకు అటూ 4 సర్వీసులు ఉన్నాయి. చెన్నైకు ఒకసారి వెళ్లి వస్తోంది. గతంలో విశాఖనుంచి సర్వీసు ఉండేది. కానీ రోడ్డు మార్గాన 3గంటల్లో వచ్చేస్తుండడంతో ఎక్కువ మంది విమానం ఎక్కడానికి ఇష్టపడడంలేదు. దీంతో అది రద్దయింది. విమాన ప్రయాణికులు పెరిగితే అక్కడినుంచి కూడా మొదలవుతాయి. ఇక విజయవాడ, తిరుపతి ప్రయాణాలకు కొంత సమయం పట్టవచ్చని అధికారులు చెబుతున్నారు.

24 గంటలు సర్వీసుకు అనుకూలం

-ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు

రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి రాత్రీ పగలూ మొత్తం 24 గంటలూ విమాన రాకపోకలు సాగించడానికి అనుకూలమైన సౌకర్యాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రయాణికుల ఆక్యుపెన్సీ బాగుంది. రోజుకు సగటున 1400 మంది రాకపోకలు సాగిస్తున్నారు. నైట్ ల్యాండింగ్ కూడా ఉంది. ప్రధానమంత్రి ప్రయాణించే బోయింగ్ 777 వంటి పెద్ద విమానాలు ఇక్కడినుంచి రాకపోకలు సాగించవచ్చు. ప్రస్తుతం ఉన్న టెర్మినల్‌ను మరో 4 రెట్లు విస్తరిస్తున్నారు.

'జయలక్ష్మి' బాధితులకు.. ఊరట!

- ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం
- పాత చైర్మన్, వైస్ చైర్మన్‌కు చెందిన 11 ఆస్తుల సీజ్‌కి ఉత్తర్వుల జారీ
- సేల్ ఆర్డర్ కోసం ఎదురుచూపులు



సర్పవరంజంక్షన్,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కోట్లాది డిపాజిట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసిన జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ పాత చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ఆస్తుల సీజ్ చేసి బాధితులకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక మోసానికి పాల్పడిన చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన ఎస్.అన్నవరంలో ఉన్న సర్వేనెంబర్ 101, వైస్‌చైర్మన్ విశాలాక్ష్మి పేరుతో బెండపూడిలో సర్వే నెంబర్‌లో 113/4లో ఉన్న 11 ఆస్తులకు చెందిన 1968.83 చ.గజాల స్థలాలను సీజ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14న ఉత్తర్వులు జారీ చేసింది. వీరిద్దరి నిందితులతో పాటు డైరెక్టర్లు, రుణాలు తీసుకున్న వారికి చెందిన 84 ఆస్తులను సీఐడీ సీజ్ చేయడం, వీటిని ట్రిబ్యునల్ కోర్టులో వేయడంతో ప్రస్తుతం వాదోపవాదాలు కొనసాగుతున్నాయి. జయలక్ష్మి ఆర్థిక మోసం వ్యవహారంలో నిందితులకు చెందిన 95 ఆస్తులను సీజ్ చేసినట్లు అయింది. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసుకు చెందిన వ్యవహారంపై కదలిక రావడంతో రాబోయే నెలరోజుల్లో మరికొన్ని ఆస్తులను సీఐడీ ద్వారా సీజ్ చేయించే దిశగా అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. సత్వరంగా ఆస్తుల సీజ్ ప్రక్రియ, కోర్టులో వాదోపవాదాలు జరిగి సేల్ ఆర్డర్ ప్రక్రియ జరిగితే బాధితులకు ప్రభుత్వం మేలు చేసినట్లు అవుతుందని బాధితులు పేర్కొంటున్నారు.

రూ.520కోట్లు స్వాహా

కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్ ప్రధాన కేంద్రంగా ది జయలక్ష్మి మ్యూచువల్ ఎయిడెడ్ మల్టీపర్పస్ కోపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖ జిల్లాలో 29 బ్రాంచీల ద్వారా 19వేలమందినుంచి రూ.520కోట్లు డిపాజిట్లు సేకరించారు. ఇందులో 2,245మంది సభ్యులకు రూ.455.78కోట్లు వరకు రుణాలు ఇచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు. సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులు, భార్య వైస్‌చైర్మన్ రాయవరపు విశాలాక్ష్మి డిపాజిటర్లకు గడువు ముగిసినా అసలుతోపాటు వడ్డీ చెల్లించకపోవడంతో బాధితులు ఆందోళనకు గురై స్పందనలో 2022, ఏప్రిల్ నెలలో ఫిర్యాదు చేశారు. ఆందోళనకు గురైన డిపాజిటర్లు పలుచోట్ల వివిధ పోలీస్‌స్టేషన్లలో సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లపై ఫిర్యాదు చేయడంతో వీరిపై పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. జిల్లా సహకారశాఖ, సీబీసీఐడీ అధికారులు విచారణ పూర్తి చేసి రూ.582 కోట్ల మేర ఆర్థికమోసానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు 348 పేజీల నివేదికను ప్రభుత్వానికి అందించారు. ఈ ఆర్థిక కుంభకోణానికి ప్రధాన సూత్రదారులుగా జయలక్ష్మి సొసైటీ చైర్మన్ రాయవరపు సీతారామంజనేయులు, వైస్ చైర్మన్ రాయవరపు బదరీ విశాలాక్ష్మి, కుమారుడు డైరెక్టర్ ఇతర డైరెక్టర్లు రాయవరపుజయమణి, చక్రభాస్కరరావు, ప్రబల మల్లిఖార్జునరావు, మంగళంపల్లి వెంకట సుబహ్మణ్య కుమార్, వారణాసి శాంతేశ్వరరావు, దూళ్ల శ్రీనివాస్, ఆర్.నాగేశ్వరరావు, జయశంకర్‌లుగా నిర్ధారించారు. నివేదిక ఆధారంగా సీబీసీఐడీ చైర్మన్ సీతారామాంజనేయులు, వైస్ చైర్మన్ల విశాలాక్ష్మి ఐదుగురు డైరెక్టర్లను అరెస్ట్ చేశారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

నిందితుల ఆస్తులపై కోర్టులో వాదనలు

ఆర్థిక కుంభకోణం కేసులో బాధ్యులైన సొసైటీ చైర్మన్, డైరెక్టర్లకు చెందిన ఏడాదిన్నర క్రితం 64 ఆస్తులు ఒకసారి, 20 ఆస్తులు మరోసారి సీఐడీ సీజ్ చేయడం, వీటిని ట్రిబ్యునల్ కోర్టులో వేశారు. ఈ ఆస్తుల వ్యవహారమై కోర్టులో ఆర్గుమెంట్లు కొనసాగుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈనెల 14న చైర్మన్ రాయవరపు సీతారామాంజనేయులుకు చెందిన ఎస్.అన్నవరంలో సర్వే నెంబర్ 101, వైస్ చైర్మన్ విశాలాక్షి పేరుతో బెండపూడిలో సర్వే నెంబర్‌లో 113/4 లో ఉన్న 11 ఆస్తులకు చెందిన 1968.83 చ.గజాల స్థలాలను సీజ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటి ఈ కేసులో నిందితులకు చెందిన 95 ఆస్తులను సీజ్ చేసినట్లు అయింది. సీజ్ చేసిన ఆస్తుల విలువ రూ.250 నుంచి రూ.275 కోట్లు వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సెక్యూరిటీ వాళ్లు చెల్లించకపోతే..

స్థిరాస్తులను సెక్యూరిటీ పెట్టి రుణాలు తీసుకున్న వారు 10 నుంచి 15 రోజుల్లో రుణాలు చెల్లించాలని సొసైటీ పాలకవర్గ సభ్యులు నోటీసులు జారీ చేశారు. వీరి నుంచి రూ.125కోట్లు రికవరీ కోసం ట్రిబ్యునల్ కోర్టులో కేసు వేశారు. వీరు సత్వరంగా అసలు వడ్డీ కలిపి జమ చేసి రుణాలు క్లియర్ చేయాలని, లేదంటే 2022, మార్చి 31 తర్వాత నుంచి నేటి వరకు వడ్డీ వేసి కోర్టు ద్వారా రికవరీ చేస్తామని పాలవర్గం తెలిపింది.

ఆరు జీవోలు జారీ కావాలి

గంగిరెడ్డి త్రినాథరావు, చైర్మన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 11 ఆస్తులకు చెందిన ఒక జీవో జారీ చేశారు. మిగతా 6 జీవోలు జారీ కావాల్సి ఉంది. సీఐడీ వారు ఇంకా 50 మందిపై క్రిమినల్, సివిల్ కేసులు నమోదు చేయాలి. సత్వరంగా జీవోలు జారీ చేయడం పూర్తయితే ట్రిబ్యునల్ కోర్టులో ఆస్తుల వేలంపై సేల్ ఆర్డర్ జారీ చేసినట్లు జరిగితే బాధితులకు న్యాయం జరుగుతుంది.

నేడు సత్యదేవుడి హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ అన్నారు. విధులు కేటాయించిన సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.

శివసదన్ కాటేజీకి అడ్వాన్స్ విరాళం

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మితమైన శివసదన్ కాటేజీకి హైదరాబాద్‌కు చెందిన లింగ శార్దక్ మంగళవారం అడ్వాన్స్ విరాళంగా రూ.2,01,101 ఆన్‌లైన్‌లో పంపినట్లు ప్రొటోకాల్ సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తెలిపారు. ఈ కాటేజీ డోనార్ స్కీం ద్వారా రూ.10లక్షలు చెల్లించాల్సి ఉండగా మిగిలిన మొత్తం త్వరలో పంపుతానని సమాచారమిచ్చారన్నారు.

'అన్నవరం'లో ఉద్యోగుల అంతర్గత బదిలీలు

అన్నవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో పలువురు ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేస్తూ సోమవారం ఈవో రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.ఈవో సీసీగా ఉన్న సీహెచ్ సాయిబాబాను సన్నిధి విభాగానికి మార్చి సూపరింటెండెంట్ కంచి మూర్తికి సీసీ బాధ్యతలు అప్పగించారు. పెన్నాడ వెంకటేశ్వరరావును సీఆర్వో విభాగంనుంచి పీఆర్వో విభాగానికి, వేలేటి జగన్నాథాన్ని సన్నిధి విభాగంనుంచి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయానికి, ఎంవీ గణపతిరావును ఆలయ విభాగానికి కేటాయించారు.

జిల్లా మహిళా కబడ్డీ జట్టు క్రీడాకారులు వీరే

సామర్లకోట,నవంబరు18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా మహిళల కబడ్డీ క్రీడాకారులు 16మందిని ఎంపిక చేసినట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కోశాధికారులు కొండపల్లి శ్రీనువాస్, నిమ్మకాయల కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. వీరిలో 12మంది రైడర్లుగానూ, నలుగురు వెయిటర్లుగాను ఎంపిక చేశామన్నారు. ఎంపికైనవారిలో వెంకటలక్ష్మి, అపరంజిత, అరుణ, ఉమా, మంజుల, పరిమళ, వర్షిత, నాగమణి, అశ్రిక, రేఖ, దీపిక, పూనశ్రీ ప్రవల్లిక, జీవన జ్యోతి, నందిని, భవాని, శివజ్యోతి ఉన్నారు. త్వరలో జరిగే అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్‌లోపాల్గొంటారన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు

- సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు
- బాలికల విభాగంలో ప్రథమస్థానం, బాలురలో ద్వితీయస్థానం



రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించిన తూర్పుగోదావరి బాలికల జట్టు

కాకినాడఅర్బన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరుగుతున్న పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-19 హాకీ చాంపియన్‌షిప్ సోమవారంతో ముగిసింది. హోరాహోరీగా జరిగిన పోటీల్లో వివిధ జిల్లాలనుంచి 450మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు తమ సత్తా చాటారు. బాలికల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమస్థానం సాధించింది. బాలురవిభాగంలో ద్వితీయస్థానం సాధించారు. పోటీల్లో బాలికల్లో అనంతపురం ద్వితీయస్థానం, విశాఖ తృతీయస్థానం సాధించాయి. బాలుర విభాగంలో విశాఖ ప్రథమస్థానం సాధించగా ఉమ్మడి తూర్పు ద్వితీయస్థానం, అనంతపురం తృతీయస్థానం సాధించాయి.

విజేతలకు బహుమతి ప్రదానం

పోటీల్లో గెలిచిన విజేతలకు డీఎస్డీవో బి.శ్రీనివాసకుమార్ అధ్యక్షతన బహుమతి ప్రదానం కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, జేఎన్టీయూ క్రీడా కార్యదర్శి శ్యామ్‌కుమార్, హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వివిధ జిల్లాల క్రీడాకారులను రాష్ట్రస్థాయి జట్లకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. కార్యక్రమంలో హాకీ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి వి.రవిరాజు, పీఈటీ సంఘ జిల్లా కార్యదర్శి కె.నూకరాజు, ట్రెజరర్ రవి సుందర్‌కౌర్, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి జి.సునీల్ పాల్గొన్నారు.

తప్పుడు కేసు పెట్టి.. తప్పుడు ప్రచారం

- టీడీపీ నేత, మహాసేన రాజేష్
- నిజనిర్ధారణ చేయాలంటూ కోనసీమ ఎస్పీకి వినతి

అమలాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో 30కి పైగా తప్పుడు కేసులు పెట్టించి వేధింపులకు గురిచేశారని మహాసేన రాజేష్ ఆరోపించారు. తనకు కోర్టులపై పూర్తి నమ్మకం ఉందన్నారు. ఇప్పటికే జగన్ ప్రభుత్వంలో పెట్టిన 15కు పైగా కేసులను కోర్టులు కొట్టి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవలకాలంలో జిల్లానుంచి ఓమహిళ తప్పుడు ఫిర్యాదు చేసిందని దానిపై నిజనిర్ధారణ చేయాలని కోరేందుకు సోమవారం కోనసీమ జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీ బి.కృష్ణారావును కలిసి వివరించినట్టు ఆయన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా జనవరిలో ఏదో జరిగిందని వైసీపీ సానుభూతిపరురాలు నవంబరులో ఫిర్యాదు చేయడంలో మర్మమేమిటో తెలుసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే కేసు పెట్టుకునే అవకాశం ఉన్నా ఎందుకు పెట్టలేదో ఆలోచించాలన్నారు. మహిళ ఫిర్యాదు చేయగానే కొన్నిచానళ్లలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్‌పై కేసునమోదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తనను, తన పార్టీని బద్నామ్ చేసేందుకు ప్రత్నిస్తున్నారని దుయ్యబట్టారు. మహిళ ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి నిజనిజాలు వెలికి తీయాలని కోరినట్టు ఆయన తెలిపారు.



అమలాపురం ఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న మహాసేన రాజేష్

ప్రాణం తీసిన ఈత సరదా

- కాలువలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి



పాముల గౌతమ్(ఫైల్)

దేవరపల్లి,నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి కాలువలో స్నానానికి వెళ్లిన విద్యార్థి నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి గ్రామానికి చెందిన పాముల వెంకట్రావు, శిరీష దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు పాముల గౌతమ్(14) స్థానిక ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు దినం కావడంతో స్నేహితులు పోలుమాటి బాలారిషి, మద్దాల దుర్గాప్రసాద్, కనికెళ్ల సిద్దార్థ, కోనాల భరత్, కనికెళ్ల నందులతో కలిసి సాయంత్రం 3గంటలకు దేవరపల్లి జిల్లా పరిషత్ రహదారిలోని పోలవరం కుడి కాలువలో స్నానానికి వెళ్లాడు. గౌతమ్, దుర్గాప్రసాద్ స్నానానికి దిగగా మిగిలిన వారు గట్టుపై ఉన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాళ్లు అందక గౌతమ్ నీట మునిగిపోయాడు. దుర్గాప్రసాద్‌ను గట్టుపై ఉన్న స్నేహితులు ప్యాంటు, షర్టు ముడివేసి పైకి లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్నేహితులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయి ఈ విషయాన్ని తల్లిదండ్రులు ఎవరికీ చెప్పలేదు. సాయంత్రమైనా గౌతమ్ ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా స్నేహితులు కలిసి కాలువ స్నానానికి వెళ్లారని స్థానికులు చెప్పారు. దీంతో ఆ వీధిలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా గౌతమ్ స్నేహితులతో వెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిగిలిన స్నేహితులు జరిగిన సంఘటనను వివరించారు. సోమవారం ఉదయం ఘటన ప్రాంతానికి బంధువులు, పోలీసులు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మునిగిన ప్రాంతం నుంచి 200మీటర్లు దూరంలో రెల్లిగడ్డి దుబ్బిలో మృతదేహం లభించినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



పోలవరం కాల్వలో తేలియాడుతున్న మృతదేహం

పొలానికి నీరు పెడుతుండగా విద్యుదాఘాతం

- ముగ్గుళ్లలో వ్యక్తి మృతి

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం ముగ్గుళ్ల గ్రామానికి చెందిన మిరప శ్రీను(56) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సోమవారం ఉదయం అతడు తన పొలానికి నీరు పెట్టుకోవడానికి వెళ్లాడు. పక్కరైతు సరిహద్దుపొలం నుంచి బోదె ద్వారా నీరు ఇతడి పొలంలోకి రావాలి. బోదెద్వారా వచ్చే నీటిని గమనిస్తుండగా విద్యుత్ స్థలం నుంచి 11కేవీవైరు తెగి నీటిలో పడగా శ్రీను షాక్‌కు గురైమృతిచెందాడు. పక్క రైతు మధ్యాహ్నం పొలం వద్దకు వెళ్లగా రెండు కాళ్లు కాలిపోయి విగతజీవిగా ఉన్న శ్రీను కనిపించడంతో మృతుడి కుమారుడు రామారావుకు తెలిపాడు. ఎస్ఐ రామ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఏసీబీ వలలో రంగంపేట సర్వేయర్

- రూ.75 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏసీబి వలలో రంగంపేట మండల సర్వేయర్ చిక్కాల ధర్మారావు చిక్కాడు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన బత్తిన రాముడు తన తల్లి బత్తిన సత్యవతి పేరున ఉన్న పొలం వివరాలు తప్పుగా పడ్డాయి. దాన్ని సరి చేయాలని సర్వేయర్ ధర్మారావును కోరగా రూ.75వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు రాముడు ఒప్పందం కుదుర్చుకొని తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి ధర్మారావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ దాడిలో ఇన్‌స్పెక్టర్ ఎన్వీ భాస్కరరావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పాల్గొన్నారు.



అధికారులకు చిక్కిన సర్వేయర్ చిక్కాల ధర్మారావు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులుగా హర్షవర్ధన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కె.హర్షవర్ధన్‌ను నియమించారు. సోమవారం ఆయన కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్, డీఆర్వో వెంకటరావును కలిశారు.



కాకినాడలో కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసిన హర్షవర్ధన్

ఇనుప కడ్డీల మాటున గంజాయి రవాణా

కొవ్వూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు వద్ద సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాలీ లారీలో ఇనుప కడ్డీలు మాటున యర్రవరం టోల్‌గేట్ వద్ద లోడ్ చేసుకుని మహారాష్ట్రలోని అహ్మదాబాద్‌కు తరలిస్తున్న 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ సునీత, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

సొంతింటి కల నెరవేరే వరకూ పోరాటం

» సీపీఐ జిల్లా కార్యదర్శి మధు
» సచివాలయాలకు ఇళ్ల దరఖాస్తులతో వెళ్లి నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేరే వరకూ దశలవారీ పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సీపీఐ-ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆయా వార్డుల్లోని సచివాలయాల ఎదుట ఇళ్ల స్థలాల దరఖాస్తులు అందజేసేందుకు సోమవారం క్యూకట్టారు.మధు మాట్లాడుతూ దరఖాస్తుదారులకు సమాధానం చెప్పలేక కొన్ని సచివాలయాల అధికారులు, సిబ్బంది తాళాలు వేసుకుని సర్వే ఉందని చెప్పి బయటకు వెళ్లి పోయారని, మరికొందరు మాత్రం తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పి దరఖాస్తులు స్వీకరించారన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న చాలా మంది నిరుపేదలకు ఇళ్లు లేవని, వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. లేకుంటే డిసెంబరు రెండో వారం నుంచి ఇళ్ల స్థలాలకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, నాయకులు సప్ప రమణ, కె శ్రీనివాస్, నౌరోజీ, సేపేని రమణమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నరసన్నకు మొక్కు చెల్లించుకున్న రుడా చైర్మన్

కోరుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి సోమవారం కోరుకొండ లక్ష్మీ నరసింహస్వామి కొండ దిగువున పాదాల వద్ద 108లీటర్ల పాలతో అభిషేకం చేసి 108కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. బీవీఆర్‌కు మంచి పదవి లభిస్తే 108లీటర్ల పాలతో అభిషేకం చేసి 108 కొబ్బరికాయలు కొడతానని పశ్చిమగోనగూడెం టీడీపీ నాయకుడు, సర్పంచ్ రొంగల దేవిక శ్రీనివాస్‌లు స్వామి వారికి మొక్కుకున్నారు. దీనిలో భాగంగా సోమవారం మొక్కుచెల్లించుకున్నారు. అభిషేకం అనంతరం దిగువ దేవస్థానంలోని నరసింహ స్వామి మూల విరాట్‌ను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా బీవీఆర్‌కు ఆలయార్చకులు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సతీమణి వెంకటలక్ష్మి, బీజేపీ నాయకుడు ఏపీఆర్ చౌదరికి స్వామి వారి శేషమాల, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో రొంగల శ్రీనివాస్ దంపతులు, నాగ కేశవరావు, గంగిశెట్టి సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆవభూముల కొనుగోలులో అవకతవకలు

కోరుకొండ, నవంబరు18(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం బూరుగుపూడి అయ్యన్న గళ్ల ఆవభూముల అవకతవకలపై ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అసెంబ్లీలో గళమెత్తారు. పేదల ఇళ్ళస్థలాల ముసుగులో ఆవభూముల కొనుగోలుపై పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఎమ్మెల్యే బత్తుల శాసన సభ దృష్టికి తీసుకొచ్చారు. అప్పటి వైసీపీ పాలకులు ఈ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మి అక్రమాలకు పాల్పడ్డారని దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సభ దృష్టికి తెచ్చారు. ఈ ఆవభూముల అవకతవకలపై పోరాటం చేసిన టీడీపీ, జనసేన నాయకులపై కేసులు కూడా నమోదు చేశారని ఎమ్మెల్యే బత్తుల వివరించారు.

ఈపీఎస్-95 పెన్షనర్లకు రూ.9 వేలు ఇవ్వాలి

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట విద్రోహదినం పాటిస్తూ నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈపీఎస్ - 95 పెన్షనర్లకు కనీస పెన్షన్ నెలకు రూ.9 వేలు చెల్లించాలని ఏపీఆర్‌పీఏ కార్యదర్శి మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట సోమవారం ఈపీఎస్ - 95 పెన్షనర్లు విద్రోహదినం పాటించారు. మాట్లాడుతూ ఈపీఎస్ - 95 పెన్షన్ విధానం ప్రారంభించిన రోజును విద్రోహదినంగా జరుపుకుంటున్నామన్నారు. ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వంలో మార్పు రాకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రిటైర్డు పెన్షనర్స్ అసోసియేషన్ కోశాధికారి ప్రభాకర్, అప్పారావు, బలరాం రాజు తదితరులు పాల్గొన్నారు.

కవి సోమసుందర్‌కు నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్ నవంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తన జీవితాన్ని కవిత్వానికే అంకితం చేసిన మహనీయుడు అవంత్స సోమసుందర్ అని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో జరిగిన సభలో మాట్లాడారు. ఆరున్నర దశాబ్దాల సాహితీ యాత్రలో అనేక ఉద్యమాలు, పోరాటాలు చవి చూశారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పీవీబీ.సంజీవరావు, ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

'వార్షిక బడ్జెట్‌లో అన్యాయం'

రాజ్యామహేంద్రవరం సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలకు గండి కొట్టే ప్రయత్నాలు చేస్తుందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు పి.టాన్యా అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహిస్తున్న తొలి బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రజలకు నిరాశ మిగిలిందన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ ఆధార మైన జిల్లాలోని సాగునీటి వనరులకు రూ.50 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు.

ఓం నమః శివ రుద్రాయ!

» శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు
» భక్తుల కార్తీక పుణ్యస్నానాలు
» దేవాలయాల వద్ద పూజలు.. అభిషేకాలు.. దీపారాధన



రాజానగరంలో ధాత్రీ వృక్షం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రాజానగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. భక్తులు వేకువజాము నుంచే పుణ్య స్నానమాచరించి ఆలయాలకు చేరుకున్నారు. పరమ శివునికి ప్రీతిపాత్రమైన ఆవుపాలు, పలు రకాలైన పండ్ల రసాలు, తేనె, చందనం, చెరుకు రసంతో అభిషేకాలు చేపట్టారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉసిరి, జమ్మి, మారేడు తదితర దేవతా వృక్షాలకు పసుపు, కుంకుమలు అర్పించి కార్తీక దీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. అలాగే అర్చకులకు దీప, సాలగ్రామ, ఉసిరి దీపదానాలు సమర్పించారు. అనేక మంది మహిళలు 108 సార్లు శివాలయ ప్రదర్శనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన కార్తీక అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అలాగే చక్రద్వారబంధం, తూర్పుగోనగూడెం, నరేంద్రపురం, నందరాడ, కానవరం, పల్లకడియం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

బిక్కవోలు: బిక్కవోలులోని గోలింగేశ్వర



బిక్కవోలులో విశేష అలంకరణలో గోలింగేశ్వరుడు

స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష బిల్వార్చన జరిపారు. అలాగే పార్వతి అమ్మవారికి లక్ష కుంకుమ పూజలు చేశారు. కొంకుదురులోని బుడతల మామిడి వద్ద త్రిముఖ లింగేశ్వరుని ఆలయంలో త్రిముఖలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. అలాగే ఊలపల్లిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది.

అనపర్తి: స్థానిక పాతవూరిలోని ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఊయల సేవ వైభవంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి శ్రీలక్ష్మి దంపతులు కర్తలుగా వ్యవహరించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు విశేష అలంకరణ చేసి ఊయలలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నక్షత్ర హారతి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అనపర్తిలో ఉమారామలింగేశ్వర ఊయల సేవ

క్వారీ, టిప్పర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాబి

కడియం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) కడియం మండలం వేమగిరి క్వారీ లారీ, టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా చెల్లుబోయిన మణికృష్ణ(బాబి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తదితరులు అభినందించారు.

ఆరోగ్య సహాయకులకు నేడు, రేపు శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి మంగళ, బుధవారాల్లో (19, 20 తేదీల్లో) ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా మలేరియా ఇన్‌చార్జి అధికారి డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో ఈ శిక్షణ జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల నుంచి ఎంపిక చేసిన ఆరోగ్య సహాయకులు హాజరవుతారని తెలిపారు.

టీకేపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా : బాలేపల్లి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తనను పదేపదే కించపరిచి మాట్లాడం సరికాదని ఆ పార్టీ సీనియర్ నేత మాజీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ళుగా కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణగా పనిచేశానని చెప్పారు. మరొకసారి తనను కించపరిచేలా మాట్లాడితే పరువు నష్టం దావా వేస్తానన్నారు.

టూటౌన్ సీఐ సస్పెన్షన్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం టూటౌన్ సీఐ వి.దుర్గారావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దుర్గారావు గుడివాడ టూటౌన్‌లో సీఐగా పనిచేసినప్పుడు ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణల నేపథ్యంలో డీఐజీ విచారణకు ఆదేశించారు. అటుపై దుర్గారావు రాజమహేంద్రవరం బదిలీపై వచ్చారు. విచారణ నివేదిక ఆధారంగా ఆయనను సోమవారం సస్పెండ్ చేశారు.

2250 కిలోల మాంసం సీజ్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాడితోట సమీపంలో కేరళకు చెందిన ఓ మాంసం వ్యాపారి నిల్వ చేసిన 2250 కిలోల ఆవు మాంసాన్ని పోలీసులు పట్టుకున్నారు. కేరళకు చెందిన జార్జి వాగ్గేయ తాడితోట వద్ద ఒక పాయింట్ పెట్టుకుని ఎటువంటి అనుమతుల్లేకుండా ఆవు మాంసం నిల్వచేసి కేరళకు ఎక్స్‌పోర్టు చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు సోమవారం రైడ్ చేసి ఫ్రిజ్‌లో నిల్వ చేసిన మాంసాన్ని సీజ్‌చేసి జార్జి వాగ్గేయను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

గ్రంథాలయాలతో ఉజ్వల భవిష్యత్

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
విద్యార్థులకు వివిధ పోటీలు

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకాలు గ్రంథాలయాలని రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పార్థసారధి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయోద్యమకారుల సంస్మరణసభకు ఆయన ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముందుగా గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకటరమణ, ఎస్ఆర్ రంగనాథ్, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథాలయోద్యమంలో అయ్యంకి సేవలను స్మరించారు. ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు పి.కృష్ణమూర్తి తెలుగు భాషపై పట్టు సాధించడానికి పద్యాలు,సాహిత్య పుస్తకాలు చదవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నిర్వహించిన దేశభక్తి,జానపద పోటీల్లో పలు పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణనాయక్

చదరంగం ఆడాలి: ఆర్డీవో

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదరంగం ఆడడం వల్ల మైండ్ చురుకుగా పనిచేస్తుందని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం కందుకూరి వీరేశలింగం టౌన్ హాల్‌లో ఉన్న జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ అండ్ రీడింగ్ సమాజ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. దాదాపు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దానవాయిపేట మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గౌతమి గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం,నిజ జీవితంలో టెక్నాలజీ ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీతంపేట గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు ప్రతిభ,టౌన్ హైస్కూలు,ఏపీపీఎం హైస్కూలు విద్యార్థులు 38 హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాలరాయుడు, మేడా గురుదత్త ప్రసాద్, రెడ్డి రాజు, కూరగంటి సతీష్, ముంగండి సూర్యనారాయణ, ఇజ్జిన నవీన కుమారి, ఎం.కళ్యాణి, ఎం.సంగీత,ఆర్.అమృతలక్ష్మి పాల్గొన్నారు.

కార్యక్రమంలో అధ్యాపకుడు ఎస్.కృష్ణ, ఉపాధ్యాయురాలు కె.రాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కొంకుదురు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక హైస్కూల్ నుంచి 40 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎన్.బాల, హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, డ్రాయింగ్ టీచర్ టి.కృష్ణ పాల్గొన్నారు.



రంగంపేటలో గ్రంథాలయ వారోత్సవాలు

ఎంపీ తంగెళ్ల ఉదయ్‌కు ఘన స్వాగతం

రాజానగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బొగ్గు, గనుల మంత్రిత్వశాఖ సలహా సంప్రదింపుల కమిటీ సభ్యులుగా నియమితులైన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు సోమవారం రాజానగరంలో జనసైనికులు, వీర మహిళలు స్వాగతం పలికారు. మధురపూడి విమానాశ్రయం నుంచి కాకినాడ వస్తుండగా మార్గమధ్యలో రాజానగరం బైపాస్ రోడ్డున ఉన్న శివాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత స్థానిక నాయకులు ముప్పిడి నాగేశ్వరరావు, కామిశెట్టి విష్ణు, హిమశ్రీ తదితరులు పూలమాలలతో ఘన స్వాగతం పలికి హారతులిచ్చారు.



మాట్లాడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకం

గైట్‌లో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

రాజానగరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని, ఈ రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాజమహేంద్రవరం రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.కళ్యాణి పేర్కొన్నారు. 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని ఇండియన్ ఫార్మాస్యూటికల్ సంఘం, రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, వికాస్ ఫార్మసీ సంయుక్తంగా గైట్ ప్రాంగణంలో సోమవారం ఫార్మసీ వారోత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కల్యాణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో అంకిత భావం కలిగి ప్రతి రోజు కొత్త విషయాలు తెలుసుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. భారతదేశంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం అని ఫార్మా రంగంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో గైట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి. ధనరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రన్, డాక్టర్ మురళీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తహశీల్దారు పోశిబాబుకు వినతిపత్రం ఇస్తున్న స్టాలిన్, కిరణ్‌కుమార్ తదితరులు

ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దారు, సీఐలకు వినతిపత్రాలు అందజేత

కడియం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానానికి అనుగుణంగా యంత్రాలు ఉపయోగించకుండా ఇసుకను తీసుకునేందుకు ఎల్ -2 కాంట్రాక్టర్ అతని బినామి అయిన కోనసీమకు చెందిన ఏ.బాబి, మరికొంత మంది ఇసుకను తవ్వుతున్నారని జేగురుపాడు సర్పంచ్ యాదల స్టాలిన్, షిపర్‌మెన్ సొసైటీ అధ్యక్షులు సాకా కిరణ్‌కుమార్ కడియం తహశీల్దారు పోశిబాబుకు, సీఐ ఏ.వేంకటేశ్వరరావుకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈనెల 17న సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత యంత్రాలను ఉపయోగించి ఇసుకను తరలించారని ఫిర్యాదు చేశారు. ఇసుక ర్యాంపును ఆనుకుని వేలాది ఎకరాల పంట ఉందని, జియో కోఆర్డినేషన్‌లో కాకుండా కాంట్రాక్టర్ నచ్చిన చోట ఇసుక తవ్వుతున్నారని దీనివల్ల వరదల సమయంలో పంట భూములు పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్‌కుమార్, ఫిషర్‌మెన్ సొసైటీ మాజీ అధ్యక్షులు బళ్ళ అన్నవరం, మారే శ్రీనివాసరావు, వారా శరత్ తదితరులు ఉన్నారు.



హైందవ శంఖారావం ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయండి

దివాన్‌చెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని సంఘ మండల కన్వీనర్ గ్రంధి గణేష్‌గుప్తా కోరారు. దివాన్‌చెరువులోని ధరణీగోదావరి విద్యాపీఠంలో రిమ్మలపూడి సుబ్బరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైందవ శంఖారావం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా గణేష్ మాట్లాడుతూ ధర్మాచార్యులఆశీస్సులతో దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా హిందువుల మనోభావాలను అర్థం చేసుకుని ప్రభుత్వాలు వెంటనే స్పందించాలన్న లక్ష్యంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైందవశంఖారావానికి మద్దతు పలకాలని హిందూబంధువులందరినీ కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో తిక్కన వీరవెంకట్రావు, కంకటాల మూర్తి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఫిజియో థెరపీ చేస్తున్న మధుసురేంద్రరెడ్డి

ఫిజియో థెరపీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బిక్కవోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన విద్యార్థుల తల్లిదండ్రులందరూ ఫిజియో థెరపీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారి సీహెచ్‌వివి సత్యనారాయణ సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం విద్యార్థులకు ఫిజియో థెరపీ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజియో థెరపిస్టు ఎం.మధుసురేంద్రరెడ్డి, ఐఈఆర్‌టీ డి.సన్యాసిరావు పాల్గొన్నారు.



శ్రీదేవికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్ చైర్మన్ శ్రీదేవికి నల్లమిల్లి శుభాకాంక్షలు

అనపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో సోమవారం రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాదిగల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. విజయవాడ ఎన్టీఆర్ భవన్‌లో ఏపీఎస్ఆర్‌టీసీ కార్యాలయంలో ఆర్టీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కొనకళ్ళ నారాయణరావును కలిసిన ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఏపీ లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఎమ్ఎస్ఎన్ చౌదరి ఉన్నారు.

కిక్‌బాక్సర్ దివ్యశ్రీకి ప్రోత్సాహం

రాజమహేంద్రవరంరూరల్/కడియం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు గిరిజన సంక్షేమ పాఠశాలలో 8వ చదువుతున్న కర్రి దివ్యశ్రీ కిక్ బాక్సింగ్‌లో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరిచింది. ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ పోటీలలో పాల్గొనాలంటే రూ. 60వేలు అవసరం ఉంది. దివ్యశ్రీది నిరుపేద కుటుంబం అనే విషయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి, కడియం గ్రామానికి చెందిన వైద్య ఉద్యోగి సిహెచ్ విల్సన్‌పాల్ దృష్టికి వచ్చింది. దీనితో కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ రూ. 10 వేలు, నర్సరీ సంఘం డైరెక్టర్ గాద నాగేశ్వరరావు మిత్ర బృందం, ఏపీజీఈఏ జిల్లా కార్యదర్శి విల్సన్‌పాల్ మిత్ర బృందం, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ సిబ్బంది ద్వారా మరో రూ. 50వేలు కలిపి మొత్తం రూ. 60 వేలను ఏపీజీఈఏ జిల్లా కోశాధికారి కె.వెంకటేశ్వరరావు ద్వారా కడియపులంక సర్పంచ్ పాటంశెట్టి రాంజీ చేతుల మీదుగా కిక్‌బాక్సర్ దివ్యశ్రీకి అందించారు. దేశానికి పతకం సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

జాయింట్ కలెక్టర్ చొరవతో

సమస్యకు పరిష్కారం

సీతానగరం, నవంబర్ 18(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ చొరవతో వంగలపూడి ఇసుక ర్యాంపు సమస్యకు పరిష్కారం లభించింది. సోమవారం వంగలపూడి ఇసుక ర్యాంపు వద్దకు చేరుకుని ర్యాంపు నిర్వాహకులు, ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీలతో చర్చించారు. గిట్టుబాటు ధర విషయమై అందరూ చర్చించుకుని పరిష్కరించుకోవాలని కొంత సమయం ఇవ్వడంతో ఇరువర్గాలు చర్చించుకున్నారు. చర్చలు సఫలం కావడంతో మంగళవారం ఉదయం నుంచి ఇసుక తవ్వకాలు జరుపుతామని కూలీలు తెలిపారు జేసీ చినరాముడు మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక తరలింపునకు పది ట్రాక్టర్ల వరకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని వాటిని ఎవరు నిలుపుదల చేయకూడదన్నారు. వంగలపూడి ఇసుక ర్యాంపు నుంచి రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నులు ఇసుక తీయాల్సి ఉందన్నారు. దానిని మరింత పెంచాలన్నారు. స్థానికులు స్పందించి ఇసుక ర్యాంపుల వద్ద స్థానిక ట్రాక్టర్లను వినియోగించాలని కోరారు. మంగళవారం నుంచి ట్రాక్టర్‌కు ట్రిప్పునకు రూ.175 ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించింది. సంక్రాంతికి మరికొంత పెంచేలా యాజమాన్యం ముందుకు వచ్చింది. కార్యక్రమంలో వంగలపూడి సర్పంచ్ కొండ అన్నపూర్ణ, కొంచ భాస్కరరావు తహశీల్దార్ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు



ఇసుక ర్యాంపు వద్ద మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చినరాముడు

జోరుగా టీడీపీ సభ్యత్వాల నమోదు




రంగంపేటలో పార్టీ సభ్యత్వాలు తీసుకున్న మహిళలు

రంగంపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా జరుగుతోంది. ఇంత వరకు జరిగిన సభ్యత్వ నమోదుల్లో మండలంలో సోమవారం నాటికి రంగంపేట 700 సభ్యత్వాలు నమోదు చేసి మండలంలో మొదటి స్థానంలో ఉందని టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పోతుల సత్యనారాయణ(చిన్నికాపు) తెలిపారు. దొడ్డిగుంటలో 500 సభ్యత్వాలు నమోదు చేసి రెండవ స్థానంలో ఉందన్నారు. మండలంలో చంద్రేడు, పెదరాయవరం, ఎస్టీరాజాపురం, ఈల కొలను, అచ్యుతాపురం, దొంతమూరు గ్రామాల్లో జోరుగా పార్టీ సభ్యత్వాల నమోదు జరుగుతోందన్నారు. పార్టీ సభ్యత్వానికి 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వారు అందరూ అర్హులేనని తెలిపారు. కార్యక్రమంలో యలమాటి రాంబాబు, గారపాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, బలిరెడ్డి దుర్గారావు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో విజయం తథ్యం

రాజానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాయం (జీజీయు) లోని బీఎస్సీ వ్యవసాయ విభాగం ఆనర్స్ మొదటి బ్యాచ్ విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం సోమవారం జరిగింది. సమావేశంలో జీజీయు రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వ్యవ సాయ విభాగంలో బీఎస్సీ చేసిన విద్యార్థులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జీజీ యు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, విభాగా ధిపతి బీవీవీ బలరాం భగత్ తదితరులు పాల్గొన్నారు.





కార్తీక దీపోత్సవం



రాజమహేంద్రవరం కోటిలింగాల ఘాట్ సోమవారం రాత్రి కార్తీక దీపాల వెలుగులతో నిండిపోయింది.. లక్ష దీపోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి పెద్ద ఎత్తున భక్తజనం హాజరై దీపాలను వెలిగించారు.. ఎంపీ పురందేశ్వరి దీపోత్సవానికి హారతిచ్చి ప్రారంభించారు.

భక్తజన గోదారి



కార్తీకమాసం మూడో సోమవారం గోదావరి ఘాట్లు భక్తజనంతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే ఎక్కడెక్కడి నుంచో భక్తులు పెద్ద ఎత్తున గోదావరి రేవుల వద్దకు చేరుకుని స్నానం చేసి గోదావరిలో దీపాలు వదిలారు.. గట్టుపై కూర్చుని పూజలు చేశారు. రాజమహేంద్రవరం పుష్కరఘాట్, కోటిలింగాల ఘాట్, కొవ్వూరు గోష్పాదక్షేత్రం, ధవళేశ్వరం రామపాదాల రేవుల వద్ద భక్తజన సందడి కనిపించింది. రేవుల్లో కార్తీక దీపాలు కనువిందు చేశాయి. -8లో

ఈ ధరలేంటి.. శివ..శివా!



శివుడికి అత్యంత ప్రీతిప్రామైన మాసం కార్తీకం. హరిహరులకు ఇష్టమైన ఈ నెలలో నోములు, నదీ స్నానాలకు, దీపారాధనకు ప్రాశస్త్యం ఉంది. ఇంతటి ప్రశస్తి కలిగిన కార్తీకంలో పూజా సామగ్రి ధరలు కైలాసాన్ని తాకుతున్నాయి. ఇవేం ధరలు శివ శివా! అంటూ భక్తులు ఆ కైలాస వాసుడికి మౌనంగా విన్నవించుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగిపోయిన ధరలు చూసి సామాన్యుడు నొచ్చుకుంటున్నాడు. ఓ వైపు సంపూర్ణ పూజా సామగ్రి, కైంకర్యాలలో లోటు రాకూడదనే మనోభావన. మరోవైపు ధరలు వింటూ జేబులు తడుముకొనే దైన్యం. మామిడి ఆకులనూ కొనుక్కోవాల్సిన వైనం. దీంతో ఎంతో కొంత రాజీపడుతూ, మన్నించాలని భగవంతుడిని వేడుకొంటూ కార్తీకంలో పూజలను కానిచ్చేస్తున్నాడు.

పూజాసామగ్రికి ధరాఘాతం



- కార్తీకంలో మహా దోపిడీ
- ఇష్టానుసారంగా ధరలు
- భక్తులను మోసగిస్తున్న వైనం
- నియంత్రణ లేకపోవడమే కారణం
- కొబ్బరి కాయ ఒక్కటీ రూ.50
- మామిడాకులూ అమ్మకం
- కల్తీ ఆవు నెయ్యితో దీపారాధన
- అగరబత్తీలదీ ఇదే పరిస్థితి
- అంతటా పెరిగిన మోసం
- కోట్లలో సాగుతున్న వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అన్ని మాసాల్లోనూ కార్తీకం సర్వశ్రేష్టమైనదని నమ్మకం.ఏడాదంతా ఎలా ఉన్నా ఈ ఒక్క నెలలో మాత్రం ఆధ్యాత్మిక వెల్లివిరుస్తోంది. దేవాలయాలు దైవ నామస్మరణతో మార్మోగుతుంటాయి. శివుడు, అయ్యప్ప,సుబ్రహ్మణ్య, ఆంజనేయ మాల ధారణకు ఈ మాసాన్నే ఎంచుకుంటారు. ఎన్ని రోజుల దీక్ష అయినా కార్తీకం పూర్తిగా కలి సొచ్చే విధంగా ప్రణాళిక వేసుకుంటారు. కార్తీకంలో నోములు నోచుకోవడం,నదీ తీరాల్లో దీపాలు వెలిగించి దైవారాధన చేయడం కనిపిస్తుంది.దీనినే వ్యాపారులు సొమ్ము చేసు కుంటు న్నారు.ఇష్టానుసారం ధరలు పెంచి విక్రయించేస్తున్నారు. దీంతో భక్తులు ఈ ధరలేంటి శివ శివా అంటున్నారు.

పూజ సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఏ వస్తువు కూడా రూ.20కి తక్కువ లేకుండా ఉంది. చివరికి ఐదు కొమ్మల మామిడి ఆకులను రూ.20కి అమ్మేస్తున్నారు. పనస ఆకుల విస్తరి ధరా అంతే. పత్రి పేరుతో రకరకాల ఆకులను అంగట్లో పెడుతున్నారు. రూ.10 పెడితే ఒత్తులు రావడం లేదు. కొబ్బరి కాయ రూ.20 మొదలుకొని రూ.50 వరకూ ఉంది. రైతు వద్ద అంత ధర లేకపోవడం గమనార్హం. దైవారాధనకు వినియోగించే కర్పూర అరటిపండ్లు డజను రూ.40 నుంచి గరిష్ఠంగా రూ.100 చెబుతున్నారు. రాజమహేంద్రవరంలో కొబ్బరి, అరటి హోల్‌సేల్ మార్కెట్లు ఉన్నాయి. స్టేడియం రోడ్డులో పెద్ద సంఖ్యలో కొబ్బరికాయల దుకాణాలు ఉన్నాయి. గోదావరి గట్టున రోజూ ఉభయ గోదావరి జిల్లాల్లోని గ్రామాల నుంచి రోజుకు 5 వేల అరటి గెలలు హోల్‌సేల్ మార్కెట్‌కి వస్తాయి. ఇక్కడ ధరలకు రిటైల్‌గా విక్రయించే రేట్లకు పొంతన ఉండడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరటి పండ్లు, అరటి దొప్పలు, అగరవత్తులు, తమలపాకులు, కర్పూరం.. అన్నిటి ధరలూ అధికంగానే ఉన్నాయి. ఒకప్పుడు రూ.10 ఉండే 50 గ్రాముల కర్పూరం బిళ్లల ప్యాకెట్ ఇప్పుడు రూ.40 అయిపోయింది. కాస్త మంచిది కావాలంటే రూ.160 వరకూ చెల్లించాలి. ధూప్‌స్టిక్స్ రూ.10 నుంచి రూ.30కి చేరిపోయాయి. అయ్యప్ప పడి పూజ నిర్వహిస్తే పువ్వులకు, పూజా సామగ్రికే 70 శాతం డబ్బులు ఖర్చయిపోతున్నాయి. రూ.20కి లెక్కపెట్టి మరీ 10 చొప్పున చామంతి, బంతి పువ్వులు ఇస్తున్నారు. సోమవారమైతే రూ.20కీ పువ్వులు రావడం లేదు. అగరవత్తుల కాస్త సువాసన వచ్చేవి కావాలంటే రూ.50 నుంచి ధర మొదలవుతుంది. ఇక అయ్యప్ప ఇరుముడికి కావాల్సిన సంచి, అభిషేకం కిట్టు, నెయ్యి, కొబ్బరి కాయలు, రవిక ముక్కలు, కొత్త టవల్, బియ్యం ధరలూ గతేడాదికి ఇప్పటికీ నూరు శాతం పెరిగాయి.దీక్షకు అవసరమైన పూసల మాలల రేట్లూ విపరీతంగా ఎక్కువయ్యాయి. గతంలో రూ.50కి దొరికే తులసి మాల ధర రూ.250కి చేరుకొంది. స్వచ్ఛమైన స్ఫటిక,చందనం పూసలు రాగితో గుప్పినవైతే రూ.1500, వెండితో కనీసం రూ.5 వేలు అవుతోంది.ఈ క్రమంలో దీక్ష పూర్తయ్యే సరికి వ్యయం లెక్కలోకి తీసుకుంటే ఐదేళ్ల క్రితా నికి ఇప్పటికీ 500 శాతం వ్యత్యాసం గమనించవచ్చు.

పసుపు..కుంకుమ కల్తీవే..

పసుపు,కుంకుమ అయితే పూర్తి గా కల్తీవే వస్తున్నాయి. ఆవుపాలను అభిషేకానికి వినియోగిస్తారు.ఇవి పూర్తిగా కల్తీవే విక్రయిస్తు న్నారు. వాటి ధరలు తక్కువేమీ లేదు. 50 గ్రాముల పసుపు, కుంకుమ రూ.25 చొప్పున రేటు ఉంది. బ్రాండెడ్ కావాలంటే మరో రూ.10 ఇవ్వాల్సిందే. ఒకప్పుడు రూ.5కి 100గ్రాములు వచ్చే పటిక బెల్లం చిప్స్‌ప్యాకెట్ రూ.20కి చేరింది. ఇలా ఒక టేమిటి అన్ని ధరలూ పెరిగిపోయాయి. ఇక కొబ్బరికాయ ధర వింటే అమాంతం పడి పోతారంతే. ఎందుకంటే ఒక్కో కాయ ధర రూ.40 నుంచి రూ.50 మధ్య ఉంది. రైతు వద్ద రూ.10లకు కూడా కొనని కొబ్బరికాయను ఆలయాల వద్ద రూ.20లకు విక్రయించడం గమనార్హం. ఇక అరటి పండ్లదీ అదే పరిస్థితి. కర్పూర డజను సైజు బట్టి రూ.50 నుంచి రూ.100లకు విక్రయిస్తున్నారు.5 అరటి ఆకులు రూ.30లు తీసుకుంటున్నారంటే ఎంత దోపిడీయో అర్థం చేసుకోవచ్చు.ఇక దీపాలు వదిలేందుకు వినియోగించే అరటి పువ్వులు, డొప్పల ధర చూసి గ్రామస్తులు నోరెళ్లబెడు తున్నారు.ఎందుకంటే ఒక్కో డొప్ప రూ.10.. అరటి పువ్వు అయితే రూ.30.. పట్టణవాసులు తెలియక ఎంత అడిగితే అంత ఇచ్చి దీపాలు వదులు కుంటున్నారు.తమలపాకులు, వక్క, ఒకటే మిటి పూజకు వినియోగించే అన్ని ధరలు అమా ంతం పెంచేశారు.ధరలపై కనీస నియంత్రణ లేక పోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. కార్తీక మాసాన ఈ ధరలేంటి నమశ్శివాయ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెయ్యి తీరే వేరు ఈశ్వరా!

కార్తీకంలో దీపారాధనకు నూనె కంటే ఆవు నెయ్యి శ్రేష్టమని భావిస్తారు. ఆవు నెయ్యితో ఒత్తులు వెలిగిస్తారు.అయితే మార్కెట్‌లో నెయ్యి ఉత్పత్తికి, ధరలకు పొంతన కుదరడం లేదు. ప్రస్తుతానికి రూ.వెయ్యి వెచ్చించినా స్వచ్ఛమైన ఆవు నెయ్యి దొరకడం కష్టమే.అలాంటి పరిస్థితుల్లో రూ.5కి కూడా ఆవునెయ్యి ప్యాకెట్ అని అమ్మేస్తున్నారు.ప్యాకెట్లపై బొమ్మలు చూసి నిజం తెలిసినా మనసును సముదాయించుకొని పూజకు వాడుకోవడం తప్పని పరిస్థితి.గేదె నెయ్యి కంటే ఆవు నెయ్యి ఉత్పత్తి చాలా తక్కువగా ఉంటుంది. దీంతో కల్తీ నెయ్యిని పూజలకు వినియోగించాల్సి వస్తోంది.ఎక్కువ ధర పెట్టినా స్వచ్ఛమైన నెయ్యి దొరికితే అదృష్టమనే చెప్పవచ్చు. నెయ్యిలో నూనె, డాల్డా, ఎసెన్సు కలిపేసి అమ్మేస్తున్నారు.నెయ్యి కిలో రూ.వెయ్యి పైనే విక్రయిస్తున్నారు.అది స్వచ్ఛమేనా అంటే చెప్పడం కష్టమే. ఇక పూజకు వినియోగించే నూనె ధర పావు లీటరు రూ.70 అయిపోయింది.



2 గంటల్లో.. ముంబయి వెళ్లొచ్చు!



రాజమహేంద్రవరం నుంచి ముంబయికి వెళ్లాలంటే ఖచ్చితంగా 48 గంటలు పడుతుంది.. ఎందుకంటే రైలులో ప్రయాణం కదా.. ఇక నుంచి అలా అవసరంలేదు.. కేవలం రెండు గంటల్లో ముంబయి చేరుకోవచ్చు. అయితే డిసెంబరు ఒకటో తేదీ వరకూ ఆగాల్సిందే మరి.. ఎందుకంటే ఆ రోజు నుంచి రాజమహేంద్రవరం టు ముంబయికి ఎయిర్‌బస్‌లు అందుబాటులోకి రానున్నాయి.. ఏకంగా 180 సిట్టింగ్‌తో అటూ ఇటూ తిరిగేందుకు సిద్ధం చేస్తున్నారు.. అదే నెల 12వ తేదీ నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు రానున్నాయి.. వచ్చే నెల నుంచి ముంబయి, ఢిల్లీకి గాలిలో ఎగిరిపోదాం.. - 7లో



రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరిన పలు పార్టీల నాయకులు

రాష్ట్రంలో 25 లక్షల సభ్యత్వాలు

- బీజేపీని ప్రజలు ఆశీర్వదిస్తున్నారు
- రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో బీజేపీని ఆశీర్వదించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాష్ట్రంలో 25 లక్షలకు పైగా సభ్యత్వాలు నమోదు జరగడమే ఇందుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరం బీజేపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వైసీపీ నాయకుడు తగరం సురేష్‌బాబుతో పాటు పలువురు దళిత, మైనార్టీలు బీజేపీలో చేరారు. పార్టీ కండువాలను కప్పి వారిని బీజేపీలోకి ఆహ్వానించి మాట్లాడారు. అంబేడ్కర్ పేరు చెప్పుకున్న పార్టీలు ఆయనకు చేసిందేమీలేదన్నారు. మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకు చేస్తున్న పోరాటం గురించి మోదీ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఒక కమిటీ వేయడం జరిగిందని, రిపోర్టు కూడా రావడం జరిగిందని, సుప్రీం కోర్టు తీర్పు కూడా వచ్చిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి పెద్దఎత్తున సహకారం అందిస్తున్నదన్నారు. గ్రామీణాభివృద్ధిపై గత ప్రభుత్వం శీతకన్ను వేయడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, గ్రామీణాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఇలాంటి పరిస్థితిలో కేంద్రం రాష్ట్రంలో రోడ్ల నిర్మాణానికి రూ.4,800 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో భారీగా సభ్యత్వాలు నమోదు చేసిన ప్రతి కార్యకర్తలకు అభినందనలు తెలుపుతున్నానన్నారు.కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి మాట్లాడారు. పార్టీ నాయకులు మాలతిరాణి పాల్గొన్నారు.



మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్న ఎంపీ

తాడిపర్రు మృతులకు సంతాపం

ఉండ్రాజవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తాడిపర్రు మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. తాడిపర్రులో విద్యుదాఘాతానికి గురై మరణించిన బొల్లా వీర్రాజు, మారిశెట్టి మణికంఠ, కాసకాని కృష్ణ, పామర్తి నాగేంద్ర కుటుంబాలను సోమవారం పరామర్శించారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు, కూటమి నాయకులు పెండ్యాల గోవిందరావు,రాచమళ్ల శ్రీనివాసరావు, అక్కిన గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ఇబ్బందులు

సమస్య పరిష్కరించాలని రెవెన్యూ మంత్రి అనగానికి విన్నపం

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కూటమి నాయకులు కోరారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో సోమవారం రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఉమ్మడి పశ్చి మ గోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీసర్వే తప్పులతడకగా సాగిందన్నారు.రీసర్వేతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారనిమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.రైతులకు సంబంధించిన పాత రికార్డుల ఆధారంగా రీసర్వే రికార్డులు మార్పు చేయాలని కోరారు.మంత్రిని కలిసిన వారిలో కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కొఠారువెంకట్రావు,నామాన పరమేష్ పాల్గొన్నారు.



రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సమస్యను విన్నవిస్తున్న కూటమి నాయకులు

ప్రాణం తీసిన ఈత సరదా | 8 | ఇనుప కడ్డీల మాటున గంజాయి రవాణా





కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు,108 సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ఆశ, 108 సిబ్బంది నిరసన

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకలెక్టర్ కార్యాలయం సోమవారం దీక్షలు ,ధర్నాలతో దద్దరిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినిట్స్ కాఫీ ప్రకారం జీవోల సర్క్యులర్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు.యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు ఎం. సుందర్‌బాబు మాట్లాడారు. ప్రభుత్వ విధానాలతో ఆశ వర్కర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ఇటీవల రిటైర్మెంట్ అయిన వర్కర్స్‌కు బెనిఫిట్స్ రూ.60వేలు అందలేదని, 60 ఏళ్ళు నిండిన వారు రెండేళ్ల వయోపరిమితి పెంపుదలకు అనర్హులుగా మిగిలిపోయారన్నారు. ఇటీవల మరణించిన ఆశవర్కర్లకు మట్టి ఖర్చులు రూ.20 వేలు అందలేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీచేయాలని కోరారు.అనంతరం యూనియన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి వినతి పత్రం అందించారు. ధర్నాకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి, బి.పవన్, వై.బేబిరాణి, జువ్వల రాంబాబు మద్దతు పలికారు.ఈ కార్యక్రమంలో మేరి, టి.రామతులసి, టి.నాగమణి, పి.అనూష, ఏ.ధనలక్ష్మి, కే.వెంకటలక్ష్మి, ఎం.హవీలకుమారి పాల్గొన్నారు.

108 సిబ్బంది దీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న 108 అంబులెన్స్ సర్వీసు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 108 సిబ్బంది కలెక్టరేట్ వద్ద దీక్ష చేశారు. 8 ప్రధాన డిమాండ్ల ధర్నా చేస్తున్నామని.. సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 25వ తేదీ తర్వాత సమ్మెకు దిగుతామని అన్నారు. సీఐటీయూ సెక్రటరీ పూర్ణిమారాజు సాయంత్రం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఈఎస్‌వీ.రమణ, గుజ్జుల రమేష్ బాబు,నానాజీ,వెంకటేశ్వరరావు, రమేష్ నాయుడు, శ్రీధర్, జగపతి, నంది రాజు, సునీత శ్రావణి, సుమలత విజయ్ దీక్ష చేశారు.



పీజీఆర్ఎస్‌కు 129 అర్జీలు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు నిర్ణీత కాలవ్యవధిలోనే పరిష్కరించాలని డీఆర్వో టి.సీతారామమూర్తి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ప్రజల అర్జీలను తక్షణం పరిష్కరించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 129 అర్జీలను స్వీకరించారు.కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీరాములునాయుడు, సీపీఐ అప్పలకొండ, డీఎల్‌డీవోలు స్లీవా రెడ్డి, డీఎంహెచ్‌వో కే.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 3 ఫిర్యాదులు స్వీకరించినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కొవ్వూరుకు చెందిన గంధం జయ ఆంధ్ర రాష్ట్ర ఉదయ రావు కొవ్వూరు పట్టణ, మండల పరిధిలోని ఇసుకర్యాంపుల నిర్వహణ, అమ్మకందార్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. పెరవలి మండలం తీపర్రు చెందిన గొల్ల ధనరాజు తీపర్రు శ్మశాన భూమికి నిధులు మంజూరు చేయాలని ఫిర్యాదు చేశారు. గుమ్మాపు పద్మ అభయ హస్తం ఇప్పించాలని ఫిర్యాదు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలనుంచి స్వీకరించిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. చిన్న చిన్న సమస్యలను తమ మండల పరిధిలో పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో జీఎస్ఎస్ జవహర్ బాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరుపల్లిలో ప్రథమ చికిత్స కేంద్రం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కోరుపల్లిలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం కోరుపల్లిలో సోమవారం వైద్య శిబిరం, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కోరుపల్లిలో డెంగ్యూ అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. ఉదయం 8 గంటలకే డివిజినల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ గ్రామాన్ని సందర్శించారు. స్థానిక పంచాయతీ అధికార్లకు ఆదేశాలివ్వడంతో గ్రామంలో సూపర్ శానిటేషన్ నిర్వహించారు. కొంతకాలంగా అపరిశుభ్రతకు నిలయంగా మారిన డ్రైనేజీలు, రోడ్లు ఒక్కరోజులోనే శుభ్రపడ్డాయి. మరో పక్క కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ కె.హేమరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్సా కేంద్రం ఏర్పాటు చేశారు. మరో పక్క వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఇనుప కడ్డీల మాటున గంజాయి రవాణా



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

287 కిలోలు స్వాధీనం..

ఇద్దరి అరెస్టు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం కొవ్వూరు గామన్ బ్రిడ్జి టోల్‌గేటు వద్ద సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాలీ లారీలో ఇనుప కడ్డీలు మాటున యర్రవరం టోల్‌గేట్ వద్ద లోడ్ చేసుకుని మహారాష్ట్రలోని అహ్మదాబాద్‌కు తరలిస్తున్న 287 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, మధ్యప్రదేశ్ రాష్ట్రం సిద్ధి జిల్లా సిహవాల్ తహశీల్, నక్టహర్ ఖుర్ద్ గ్రామానికి చెందిన సాగర్ సాకేత్, సింగౌలి జిల్లా చిత్రాంగికి చెందిన లాల్ బహద్దూర్ సాకేత్‌లను అరెస్టు చేశారు. నిందితులపై ఎస్ఐ కె.జగన్మోహనరావు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయిస్ డీటీ సునీత, వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తి పత్రాలపై సంతకం చేయించుకున్న

అన్నకు ఆరేళ్ల జైలు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తమ్ముడు కొడుకును బంధించి.. బెదిరించి ఆస్తి పత్రాలపై సంతకాలు చేయించుకున్న అన్నకు కోర్టు ఆరేళ్ల జైలు శిక్ష, రూ.6 వేల జరిమానా విధించినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన అడ్డాల వెంకట కృష్ణమోహన్(బుజ్జి) ఆస్తి పంపకాల్లో తనకు అన్యాయం జరిగిందంటూ 2017లో తమ్ముడు అడ్డాల శ్రీహరి, సుప్రియల నాలుగేళ్ల కుమారుడు బాల శివ శంకరును ఇంట్లో బంధించాడు. సుప్రియ, శ్రీహరిలతో పాటు, తల్లి సత్యవతిని రూ.100 స్టాంప్ పేపర్లపై సంతకాలు చేసి ఇవ్వాలని, లేకపోతే పిల్లాడిని చంపేస్తానని బెదిరించాడు. దీంతో సుప్రియ గట్టిగా కేకలు పెట్టగా చుట్టుపక్కల వాళ్లు వచ్చారు. అప్పటికీ తన కుమారుడిని వదలకపోవడంతో చేసేదిలేక ముగ్గురూ స్టాంప్ పేపరుపై సంతకాలు చేశారు. అనంతరం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్ఐ కె.అశోక్‌కుమార్ కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో కృష్ణమోహన్‌కి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పీపీ కాకులపాటి వెంకటరమణ తన వాదనను వినిపించగా, కోర్టు కానిస్టేబుల్ మేఘనాథ్ సహకరించినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

సొంతింటి కల నెరవేరే వరకూ పోరాటం

- సీపీఐ జిల్లా కార్యదర్శి మధు
- సచివాలయాలకు ఇళ్ల దరఖాస్తులతో వెళ్లి నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేరే వరకూ దశలవారీ పోరాటం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సీపీఐ-ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆయా వార్డుల్లోని సచివాలయాల ఎదుట ఇళ్ల స్థలాల దరఖాస్తులు అందజేసేందుకు సోమవారం క్యూకట్టారు.మధు మాట్లాడుతూ దరఖాస్తుదారులకు సమాధానం చెప్పలేక కొన్ని సచివాలయాల అధికారులు, సిబ్బంది తాళాలు వేసుకుని సర్వే ఉందని చెప్పి బయటకు వెళ్లి పోయారని, మరికొందరు మాత్రం తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పి దరఖాస్తులు స్వీకరించారన్నారు. పట్టణాల్లో నివసిస్తున్న చాలా మంది నిరుపేదలకు ఇళ్లు లేవని, వారందరికీ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. లేకుంటే డిసెంబరు రెండో వారం నుంచి ఇళ్ల స్థలాలకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జట్ల లేబర్ యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు, నాయకులు సప్ప రమణ, కె శ్రీనివాస్, నౌరోజీ, సేపేని రమణమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దగూడెం శ్మశానవాటికలో

బోరు నిర్మాణం



భూమిపూజ చేస్తున్న గంగరాజు తదితరులు

గోపాలపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దగూడెం శివారులో ఉన్న ఎస్సీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన శ్మశాన వాటిక ప్రాంతంలో దాత మద్దిపాటి గంగరాజు రూ.50 వేలు సొంత నిధులు వెచ్చించి సోమవారం బోరు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తన తండ్రి మద్దిపాటి సత్యనారాయణ జ్ఞాపకార్థం పెద్దగూడెంలో ఎవరైనా చనిపోతే భూస్థాపన అనంతరం ఇళ్లకు వెళ్లి స్నానాలు ఆచరించాల్సిన పరిస్థితి ఉందని, దీర్ఘకాలికంగా ఈ సమస్యకు బోరు నిర్మాణంతో పరిష్కారం చూపించామన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు దాసన్న, ప్రవీణ్‌కుమార్, తానేటి రాజు, గ్యాబ్రియేల్, కిరీటి భూషణం, మాజీ సర్పంచ్ తానేటి వీరరాఘవులు, అనిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన

రంగంపేట సర్వేయర్



ఏసీబీకి పట్టుబడ్డ సర్వేయర్ ధర్మారావు

రంగంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ వలలో రంగంపేట మండల సర్వేయర్ చిక్కాల ధర్మారావు చిక్కాడు. రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన బత్తిన రాముడు తన తల్లి బత్తిన సత్యవతి పేరున ఉన్న పొలం వివరాలు తప్పుగా పడ్డాయి. దానిని సరిచేయాలని సర్వేయర్ ధర్మారావును కోరగా రూ.75 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు రాముడు ఒప్పందం కుదుర్చుకొని తర్వాత ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సోమవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో దాడి చేసి ధర్మారావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడిలో ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ భాస్కరరావు, డి.వాసుకృష్ణ, వై.సతీష్ పాల్గొన్నారు.

శివోహం

- గోష్పాదక్షేత్రం భక్తజన సందోహం
- శివ నామస్మరణతో మార్మోగిన క్షేత్రం
- భక్తుల కార్తీక పుణ్యస్నానాలు
- సుందరేశ్వరుడికి పూజలు.. అభిషేకాలు.. దీపారాధన



కొవ్వూరు గోష్పాదక్షేత్రం గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అఖండ గౌతమీ గోదావరి తీరం కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజన సందోహంగా మారింది. శివ నామస్మరణతో మారుమోగింది. కార్తీకమాసం 3వ సోమవారం కావడంతో వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో గోష్పాద క్షేత్రానికి చేరుకుని గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టంలోని శివ లింగాలకు, రావిచెట్టు వద్ద నాగశిలలకు నదీ జలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. అనంతరం సుందరేశ్వర స్వామిని దర్శించుకుని పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన స్నానఘట్టం, తులసి చెట్టు, రావిచెట్ల వద్ద సుందరేశ్వరస్వామి ఆలయంలో





గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామికి అభిషేకాలు, నంది వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు బారులుదీరి స్వామిని దర్శించుకున్నారు. బ్రాహ్మణులకు స్వయంపాకం, దీపదానాలు చేశారు. అలాగే మండలంలోని వాడపల్లి, తోగుమ్మి, మద్దూరు, ఆరికిరేవుల, కుమారదేవం, చిడిపి, పెనకనమెట్ట, ధర్మవరం, దొమ్మేరు, గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చాగల్లు: బ్రాహ్మణగూడెంలో కార్తీక దీపారాధన

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో శివాలయాన్ని పూలతో విశేషంగా అలంకరించి దీపో త్సం నిర్వహించారు. గ్రామదేవత నాగారమ్మ ఆలయంలో దీపారాధన, జ్యోతిర్లింగార్చన జరిగాయి. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. చాగల్లులో శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయం, ఊనగట్ల శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారు జాము నుంచి శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి.

స్పటికలింగాన్ని దర్శించుకున్న మంత్రి



పెరవలి: అన్నవరప్పాడులో స్పటిక లింగ దర్శనం చేసుకుంటున్న మంత్రి దుర్గేష్

పెరవలి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): అన్నవరప్పాడులో శివాలయం వద్దనున్న స్పటికలింగ దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం రాత్రి మంత్రి దుర్గేష్ స్పటిక లింగాన్ని దర్శనం చేసుకున్నారు. సంవత్సరంలో మూడు సార్లు మాత్రమే ఈ స్పటిక లింగ దర్శనం అవకాశం ఉండడంతో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

కొవ్వూరులో కవి సమ్మేళనం

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విద్యార్థులకు వివిధ పోటీలు

కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో కవి సమ్మేళనం ఏర్పాటుచేశారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు, లెక్చరర్లు తుట్టగుంట బైరవమూర్తి, రాయప్రోలు కామేశ్వరశర్మ, పుస్తక రచయిత అనిపెద్ది జగన్నాధశాస్త్రి, తెలుగు పండిట్ చామర్తి విశ్వనాధం, కవి ఎం.రాజు విచ్చేసి విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రత్యేకంగా పుస్తకాలు చదవడం ద్వారా మేధస్సు పెరుగుతుందన్నారు. అనంతరం సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జీవీవీఎస్ త్రినాథ్, పాఠకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నల్లజర్లలో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నల్లజర్ల: నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు లైబ్రేరియన్ ఏవీ రమణ ఆధ్వర్యంలో క్విజ్ నిర్వహించారు. చెస్ పోటీలో శశి స్కూల్, క్విజ్‌లో ఏకేఆర్‌జీ విద్యార్థులు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నట్టు పేర్కొన్నారు. వ్యాసరచన పోటీల్లో ఏలైట్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం, క్విజ్, చెస్, వ్యాసరచన పోటీల్లో నల్లజర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఎల్‌డీసీ ఛైర్‌పర్సన్ గుదే సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగల్లు: చంద్రవరం గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం-తల్లిదండ్రుల బాధ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పిల్లల సెల్‌ఫోన్ వ్యసనం తగ్గించేది పుస్తక పఠనం మాత్రమేనని ఉపాధ్యాయురాలు ఆర్.రమాంబ అన్నారు. గ్రంథాలయాధికారి కె.సుమన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. దేశభక్తి పాటల పోటీలు జరిగాయి. చాగల్లు గ్రంథాలయంలో దేశభక్తి పోటీలు జరిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు, గ్రంథాల యాధికారి గద్దే శ్రీనివాసరావు, వెత్సా గంగాధరం తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరంలో అష్టావధానం

ఉండ్రాజవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం శాఖా గ్రంథాలయంలో తెలుగు ఉపాధ్యాయుడు చెరుకూరి వెంకట కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులు అష్టావధానం నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థునులతో జరిపిన ఈ కార్యక్రమం ఆసక్తిగా సాగింది. కృష్ణప్రసాద్, అవధాని జె.ప్రసన్నలను సత్కరించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వ పోటీలు పెట్టారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ కోట రామప్రసాద్, ఎల్‌డీసీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాస్, లైబ్రేరియన్ జి.కృష్ణారావు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

దేవరపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దేవరపల్లికి చెందిన పలువురు కరాటేలో ప్రతిభ కనబరిచారు. ఈ నెల 15న విజయవాడలో స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ చాంపియన్ షిప్ ప్రెసిడెంట్ కప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో దేవరపల్లికి చెందిన తీర్థ కటలో బంగారం పతకం, కుమితేలో సిల్వర్ పతకం సాధించారు. హేమ కటలో బ్రాంజ్, కుమితేలో సిల్వర్, కార్తీక్ కటలో సిల్వర్, గెలేలియో కటలో సిల్వర్, కిరణ్‌కుమార్ కటలో బ్రాంజ్ సాధించినట్టు కరాటే మాస్టారు జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

యూటీఎఫ్ దేవరపల్లి నూతన

కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

దేవరపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ దేవరపల్లి మండల శాఖ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్ పరిశీలకుడిగా వ్యవహరించారు. దేవరపల్లి అధ్యక్షుడిగా ఎల్.రామారావు, ప్రధాన కార్యదర్శిగా కొల్లి శ్యామ్ సుందర్, గౌరవ అధ్యక్షుడిగా ఓరుగంటి శివనాగప్రసాదరాజు, ఉపాధ్యక్షుడిగా మర్రి అబ్బులు, మహిళా అధ్యక్షురాలిగా కే.నర్సమ్మ, కోశాధికారి కొమారపు ఉమాకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గోపాలపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని సైబర్ నేరాలపై చిట్యాల గ్రామంలోని ఎస్‌బీఐ బ్యాంకులో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. సైబర్ మోసాలు, ఫిషింగ్, కాల్‌కలర్, ఐడీ స్కాం, ఇతర సైబర్ నేరాలపై ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ లావాదేవీలను సురక్షితంగా ఎలా నిర్వహించాలో ఖాతాదారులకు వివరించారు. సైబర్ మోసగాళ్ల వలలో చిక్కితే ఖాతాలో డబ్బులు గల్లంతవుతాయన్నారు. ఖాతాదారులు ఫేక్‌ఐడీ నెంబర్లతో ఫోన్‌కాల్ వస్తే వివరాలు వెల్లడించరాదన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ముసుగు పడింది!

గోపాలపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారి పొడవునా ఉన్న పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు సోమవారం ముసుగులు వేశారు. కోడ్ కూసినా ముసుగు పడలేదు! శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. పలువురు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను

కలిసిన సువర్ణరాజు



దేవరపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు నర్సాపురంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కుపై మూడేళ్లుగా కార్మిక సంఘాలు, వారి పరిరక్షణ కోసం చేసిన పోరాటాన్ని సువర్ణరాజు వివరించారు. 1969లో ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతిరూపమైన విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిందని, ఈ పరిశ్రమ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడాలని మంత్రిని కోరారు. కేంద్ర ప్రభుత్వం పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిల్ వేసినట్టు ఆయన గుర్తుచేశారు. అలాగే నర్సాపురంలో జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌ను సువర్ణరాజు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం



మల్టీపర్పస్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

దేవరపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి దాతలు సహకారం అందించడం అభినందనీయమని కాకినాడ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. తమ కుమారుడు పవన్‌కుమార్ జ్ఞాపకార్థం విజయవాడకు చెందిన దాతలు నెక్కలపూడి అంజయ్య, ఉషమ్మ దంపతులు రూ.6,50,000లతో రామన్నపాలెంలో జడ్పీ హైస్కూల్లో మల్టీపర్పస్ హాలు, యోగా, డైనింగ్ హాలు నిర్మించారు. నెక్కంపూడి కిరణ్ దంపతులు 60 మంది విద్యార్థులకు క్రీడాదుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆర్‌జేడీ నాగమణి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో హైస్కూల్ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిదన్నారు. పాఠశాలల్లో మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. దాతలను ఆమె ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పేరం రవీంద్రనాథ్ పీఈటీ సరస్వతి, సర్పంచ్ పుల్లారావు, నాయకులు పరిమి శ్రీరామకృష్ణ, కొయ్యలమూడి సుధారాణి, విద్యాశాఖాధికారి తిరుమలదాసు తదితరులు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్

డైరెక్టర్ సతీష్‌కు సన్మానం



కొవ్వూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందనడానికి కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చింతపల్లి సతీష్ నిదర్శనమని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జి మరపల్ల కళాధర చక్రవర్తి అన్నారు. రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైన చింతపల్లి సతీష్‌కు గ్రామ కమిటీ అధ్యక్షులు కందుల సురేంద్ర ఆధ్వర్యంలో సోమవారం అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన టీడీపీ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలడుగుల శ్రీనివాస్, యాళ్ల పోశారావు, రజక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- కాలువలో స్నానానికి వెళ్లి విద్యార్థి మృతి.. దేవరపల్లిలో విషాదం





పోలవరం కుడి కాలువ దుబ్బుల్లో గౌతమ్ మృతదేహం (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో

దేవరపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి కాలువలో స్నానానికి వెళ్లిన విద్యార్థి నీట మునిగి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి గ్రామానికి చెందిన పాముల వెంకట్రావు, శిరీష దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు పాముల గౌతమ్ (14) స్థానిక ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.ఆదివారం సెలవుదినం కావడంతో స్నేహితులు పోలుమాటి బాలారిషి, మద్దాల దుర్గాప్రసాద్, కనికెళ్ల సిద్ధార్థ, కోనాల భరత్, కనికెళ్ల నందులతో కలిసి సాయంత్రం 3గంటలకు దేవరపల్లి జిల్లా పరిషత్ రహదారిలోని పోలవరం కుడి కాలువలో స్నానానికి వెళ్లాడు. గౌతమ్, దుర్గాప్రసాద్ స్నానానికి దిగగా మిగిలిన వారు గట్టుపై ఉన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాళ్లు అందక గౌతమ్ నీటమునిగిపోయాడు. దుర్గాప్రసాద్‌ను గట్టుపై ఉన్న స్నేహితులు ప్యాంటు, షర్టు ముడివేసి పైకి లాగడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే స్నేహితులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయి ఈ విషయాన్ని తల్లిదండ్రులేవరికి చెప్పలేదు. సాయంత్రమైనా గౌతమ్ ఇంటికి రాకపోవడంతో ఆరా తీయగా స్నేహితులు కలిసి కాలువ స్నానానికి వెళ్ళారని స్థానికులు చెప్పారు. దీంతో ఆ వీధిలో ఉన్న సీసీ ఫుటేజీను పరిశీలించగా గౌతమ్ స్నేహితులతో వెళ్లడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా మిగిలిన స్నేహితులు జరిగిన సంఘటనను వివరించారు. సోమవారం ఉదయం ఘటన ప్రాంతానికి బంధువులు, పోలీసులు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. మునిగిన ప్రాంతం నుంచి 200మీటర్లు దూరంలో రెల్లిగడ్డి దుబ్బిలో మృతదేహం లభించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

మానవ అక్రమరవాణా నిర్మూలన

అందరి బాధ్యత

ఉండ్రాజవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమరవాణా నిర్మూలన అందరి బాధ్యత అని ఎంఈవో సక్సేనరాజు తెలిపారు. సోమవారం ఉండ్రాజవరం హైస్కూల్లో విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రజ్వల స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ మనుషుల అక్రమరవాణాను అరికట్టాలని చెప్పారు. ప్రజ్వల ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ యుక్తవయస్సులో ఉన్న బాలబాలికలు ఎక్కువ మోసాలకు గురవుతున్నారని, తల్లిదండ్రులు పిల్లల పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజ్వల కోఆర్డినేటర్ శ్రావ్య, సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదరంగం ఆడాలి

ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదరంగం ఆడడం వల్ల మైండ్ చురుకుగా పనిచేస్తుందని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం కందుకూరి వీరేశలింగం టౌన్ హాల్‌లో ఉన్న జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ అండ్ రీడింగ్ సమాజ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. దాదాపు 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. దానవాయిపేట మహిళా గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. గౌతమి గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం,నిజ జీవితంలో టెక్నాలజీ ప్రభావం అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సీతంపేట గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు ప్రతిభ,టౌన్ హైస్కూలు,ఏపీపీఎం హైస్కూలు విద్యార్థులు 38 హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాలరాయుడు, మేడా గురుదత్త ప్రసాద్, రెడ్డి రాజు, కూరగంటి సతీష్, ముంగండి సూర్యనారాయణ, ఇజ్జిన నవీన కుమారి, ఎం.కళ్యాణి పాల్గొన్నారు.